ప్రజాశక్తి
గురువారం 4 జులై 2024
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

విశాఖ అభివృద్ధికి కృషి

◆ ఐటి, స్కిల్ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి ◆ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటా
◆ బాధ్యతల స్వీకరణలో విశాఖ జిల్లా కలెక్టర్ హరీంద్ర ప్రసాద్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ సహ కారంతో విశాఖను ఆర్థిక రాజధానిగా మార్చేందుకు, స్కిల్ డెవలప్‌మెంట్, పర్యావరణ సహిత అభివృద్ధికి కృషిచేస్తానని విశాఖ జిల్లా నూతన కలెక్టర్ ఎంఎన్. హరీంద్రప్రసాద్ వెల్లడించారు. బుధవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అన్ని తరగతుల ప్రజలకు అందుబాటులో ఉంటానని, వారు చెప్పే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అంతర్జాతీయ ఖ్యాతిగడించిన విశాఖను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వ సూచనలు, సలహాలతో పాలన సాగిస్తానన్నారు. నగర ప్రజల జీవన పరిస్థితులపై అధ్యయనం చేసి వారి సమస్యల పరిష్కారంపై దృష్టిసారిస్తానన్నారు. తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా అందరికీ ఉత్తమ సేవలు అందేలా చూస్తానన్నారు. యువతకు అనేక అంశాల్లో నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు



విశాఖ కలెక్టర్‌గా బాధ్యతలు చేపడుతున్న హరీంద్ర ప్రసాద్

ప్రత్యేక కృషి సలుపుతానని చెప్పారు. ప్రజలు తనను ఎప్పుడైనా కలవొచ్చని, ఇప్పటి వరకు పలు విభాగాల్లో, పలు స్థానాల్లో పని చేశానని, అందరి కష్టాలు, సమస్యలు తనకు తెలుసునని అన్నారు. పర్యాటకంగా గుర్తింపు పొందిన ఈ ప్రాంతానికి మరింత గుర్తింపును తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ప్రభుత్వ పాలసీకి అనుగుణంగా అన్ని రకాల కంపెనీలు వచ్చేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. ఆర్థిక, వాణిజ్య అంశాలే అజెండాగా కార్యాచరణ రూపొందిం చుకొని ముందుకు సాగుతానని, నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా అందరి సహకారంతో జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

పలువురు శుభాకాంక్షలు

నూతన కలెక్టర్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించిన హరీంద్ర ప్రసాద్‌కు జిల్లా అధికారులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ, ఎడిసి కెఎస్.విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, విశాఖపట్నం ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్, భీమిలి ఆర్‌డిఒ భాస్కర రెడ్డి, కలెక్టరేట్ ఎఒ దేవ్ ప్రసాద్, చినగదిలి తహశీల్దార్ నరవ శివన్నారాయణ సహా పలువురు తహశీల్దార్లు, ఎంపిడిఒలు, పోలీసు శాఖకు చెందిన అధికారులు, కలెక్టరేట్‌లోని పలు విభాగాల అధిపతులు కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.



ఎయు రిజిస్ట్రార్‌కు బంద్ నోటీసు అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నేడు విద్యా సంస్థల బంద్

జయప్రదానికి ఎస్ఎఫ్ఐ సహా పలు విద్యార్థి సంఘాలు పిలుపు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నీట్, యుజిసి నెట్ పరీక్షా పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, అసమర్థ ఎన్‌టిఎను రద్దు చేయాలని, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చెయ్యాలని డిమాండ్ చేస్తూ గురువారం విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో విద్యా సంస్థల బంద్‌కు ఎస్ఎఫ్ఐ సహా పలు విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ బంద్‌కు ఇప్పటికే విశాఖ జిల్లావ్యాప్తంగా పలు ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్, ఇంటర్, డిగ్రీ కాలేజీలు, ఇంజినీరింగ్ కాలేజీలు స్వచ్ఛందంగా మద్దతు తెలిపి సెలవు ప్రకటించాయని ఎస్ఎఫ్ఐ విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.రాము, ఎల్‌జె.నాయుడు బుధవారం తెలిపారు. జిల్లాలోని అన్ని విద్యా సంస్థలకూ తాము బంద్ నోటీసులు అందించామని పేర్కొన్నారు.

ఎయు రిజిస్ట్రార్‌ను డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలని కోరగా 4న జరగాల్సిన పరీక్షలను వాయిదా వేస్తూ సర్క్యులర్ జారీ చేశారన్నారు. గురువారం జరగబోయే బంద్‌లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని 24 లక్షల మంది నీట్ విద్యార్థులకు మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగాల పేరిట మోసంపై స్మార్ట్ విలేజ్ బాధితుల ఫిర్యాదు

▶ వార్త 2లో..

ఎయు ఉద్యోగుల జీతాలు వెంటనే చెల్లించాలి

▶ వార్త 2లో..

డ్వాక్రా మహిళలకు టోకరా

▶ వార్త 5లో..



ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ చెక్కును అందుకుంటున్న రషీద్

కోస్టల్ రైడర్స్ విజయం

67 పరుగులతో రాణించిన కెప్టెన్ రషీద్ వార్త మెయిన్‌లో...

ఉత్సాహంగా.. ఉత్తేజంగా..

మన్యం వీరుడు అల్లూరిపై ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అల్లూరి విజ్ఞాన కేంద్రం, గురజాడ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో మూడు రోజులపాటు విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో తలపెట్టిన అల్లూరి సీతారామరాజు జయంతోత్సవాలు రెండో రోజైన బుధవారమూ స్ఫూర్తిదాయకంగా సాగాయి. చిన్నారులు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఉత్సాహం, ఉత్తేజం నింపాయి. నగర పరిధిలోని 30 స్కూళ్లు, డ్యాన్స్ స్కూళ్ల నుంచి సుమారు 400 మంది కళాకారులు పాల్గొని ప్రదర్శనలు ఇచ్చారు. అల్లూరి సీతారామరాజుపై అధిక భాగం ఈ ప్రదర్శనలు సాగాయి. వెస్టన్ డ్యాన్స్ కార్యక్రమాల్లో కూడా అల్లూరి సీతారామరాజు గురించి ఆధునిక పద్ధతిలో ప్రదర్శనలు ఇస్తూ కళాకారులు ఆకట్టుకున్నారు. కోలాటాలు నిర్వహించారు. ఏకపాత్రాభినయాలు వేశారు. కామెడీ స్కిట్స్ ప్రదర్శించారు.



అల్లూరి కళాప్రదర్శనతో ఆకట్టుకున్న విద్యార్థులు

కళారూపాలన్నింటికీ చప్పట్ల వర్షం కురిసింది. కళా ప్రదర్శనలను మాజీ కార్పొరేటర్ జివి.రవిరాజు, ఆంధ్ర యూనివర్సిటీ ఫైన్ ఆర్ట్స్ ప్రొఫెసర్ నరసింహారావు, దూరదర్శన్ ప్రతినిధి పల్లా ఆనంద్, రచయిత, దర్శకుడు కొరిటాల ప్రభాకర్ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఉత్సాహంగా.. ఉత్తేజంగా..

ప్రారంభించారు. కార్యక్రమాలు ఏర్పాటు చేసిన నిర్వాహకులను వారు అభినందించారు. ఉదయం 10:30 గంటలకు ప్రారంభమైన ప్రదర్శనలు రాత్రి 7 గంటల వరకు సాగాయి. కార్యక్రమాల నిర్వాహకులు దండు నాగేశ్వరరావు, వై.ఎల్లాజీ, ఆర్ఎస్ఆర్.మూర్తి, వై.అప్పారావు, పివి.రమణ, సిహెచ్.భాస్కర్, పి.మోహనరావు, హేమ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన జై పాతాళభైరవి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సురభి నాటకోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీ భానోదయ నాట్య మండలి (సురభి) హైదరాబాద్ సభ్యులు కళాభారతి ప్రాంగణంలో ప్రదర్శించిన జై పాతాళ భైరవి నాటకం ఆద్యంతం అలరించింది. ప్రధానంగా తోట రాముడు ఉజ్జయిని రాజ్య యువరాణి ఇందుమతిని ప్రేమించడం, ఉజ్జయిని రాజు వారి ప్రేమను తిరస్కరించడం, మాంత్రికుడు దుష్ట శక్తులు సంపాదించడానికి తోట రాముడిని బలి ఇవ్వాలి అనుకోవడం, మాంత్రికుడు తోట రాముడి గురించి తెలుసుకోవడం, చివరిగా తోట రాముడు మంత్రగాడిని తెలివిగా చంపటం వంటి దృశ్యాలు ఆద్యంతం అబ్బురపరిచాయి. తోట రాముడుగా మధుసూదన్‌రావు, ఇందుమతిగా సాయి సంతోషి, పాతాళ భైరవిగా హరిణి, మాంత్రికుడుగా మోహన్‌కృష్ణ, రాజుగా జయరాం తమ హావభావాలతో ప్రేక్షకులను అలరించారు. ప్రదర్శన ఆరంభ కార్యక్రమంలో లీడర్ పత్రిక సంపాదకులు వివి.రమణ మూర్తి మాట్లాడుతూ పౌరాణిక పద్య నాటకాన్ని ప్రేక్షక దేవుళ్లే ఆదరించి కాపాడాలని కోరారు. కార్యక్రమానికి అతిథులుగా మల్లెల రాజేంద్రప్రసాద్, మరపల్ల భాస్కరరావు, పిసిహెచ్ నాయుడు, అక్కునాయుడు, విధివిలాసం ప్రభాకర రావు, క్యాలు జనార్దన్, అజయ్‌శర్మ, నాంచారయ్య, రవి బ్రహ్మ హాజరయ్యారు. కళాభారతి అధ్యక్షులు ఎంఎస్ఎన్.రాజు, కళ ఆసుపత్రి డాక్టర్ పివి.రమణ మూర్తి పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యాన నేడు రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా గురువారం ఉదయం 9 గంటలకు డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సిఐటియు విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్టు సంఘం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. సిఐటియు అనుబంధ కార్మిక సంఘాల కార్మికులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశాఖ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ - 1 లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. లయన్స్ క్లబ్ కో- ఆర్డినేటర్ దుర్గాప్రసాద్ పాల్గొంటారని వెల్లడించారు.

కనీస వేతనాల కోసం వినతి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : షెడ్యూల్డ్ ఎంప్లాయిస్, కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు నిర్ణయించాలని కార్మిక ఉపాధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం.నాయక్, లేబర్ కమిషనర్ ఎంవి.శేషగిరి బాబులకు సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం అమరావతి సెక్రటేరియట్‌లో వినతి పత్రాలు అందించినట్టు జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి తెలిపారు. కనీస వేతనాల చట్టం - 1948, సెక్షన్ 5 ప్రకారం ప్రతి ఐదేళ్లకు ఒకసారి వేతనాలు సవరించాల్సిందిపోయి 17 సంవత్సరాలైనా సవరించకపోవడం సరైనది కాదన్నారు. కార్యక్రమంలో ఆల్టోస్ యూనియన్ నాయకులు వి.తులసీరామ్, శ్రావణ్ పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మున్సిపల్ కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కారం చేస్తూ జీవోలు జారీ చేయాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణకు, ప్రిన్సిపల్ సెక్రటరీ అనిల్ కుమార్ సింఘాల్‌కు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో వినతి పత్రాలను బుధవారం అందజేసినట్టు జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి యు.రాజు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ మున్సిపల్ కార్మికులు 2023 డిసెంబర్ 26 నుంచి 2024 జనవరి 10వ తేదీ వరకు నిర్వహించిన సమ్మె సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న జీవోలను వెంటనే ఇవ్వాలని, అలాగే ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు సవరిస్తూ తొమ్మిది మంది అధికారులు చేసిన రికమండేషన్స్‌ను ఆమోదించి వెంటనే జీవో జారీ చెయ్యాలని కోరారు.

మిలియన్ మొక్కల పంపిణీ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రపంచ పర్యావరణ పరిరక్షణ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని విశాఖపట్నం పోర్టు అథారిటీ సాంబమూర్తి ఆడిటోరియంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోర్టులో మిలియన్ మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని పోర్ట్ ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణకు పోర్టు అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. అనంతరం పెయింటింగ్, వ్యాసరచన, క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

ఉద్యోగాల పేరిట మోసంపై

స్మార్ట్ విలేజ్ బాధితుల ఫిర్యాదు

ప్రజాశక్తి - మాకవరపాలెం : స్మార్ట్ విలేజ్‌లో ఉద్యోగాల పేరుతో తమను మోసగించారంటూ మండలంలోని వజ్రగడ గ్రామానికి చెందిన వంటాకుల రామలక్ష్మి, తమరాన రామసిద్ధు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ వజ్రగడ గ్రామానికి చెందిన బిజెపి నాయకుడు తమరాన ఎర్రన్నాయుడు స్మార్ట్ విలేజ్‌లో ఉద్యోగాలు ఇస్తామంటూ ఒక్కొక్కరి దగ్గర రూ.లక్షా 50 వేలు వసూలు చేశాడన్నారు. నేటికీ తమకు ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. డబ్బులు ఇవ్వాలని ఎన్నోసార్లు అడగ్గా బెదిరింపులకు దిగుతున్నాడని తెలిపారు. 'నాకు బిజెపి అండగా ఉంది. మీరు నన్ను ఏమీ చేయలేరు' అంటూ బెదిరిస్తున్నట్టు బాధితులు వెల్లడించారు. పోలీసులు జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలతో పాటు ఉభయ గోదావరి జిల్లాల్లోనూ స్మార్ట్ విలేజ్ ఉద్యోగాల బాధితులు వేలల్లో ఉన్న విషయం తెలిసిందే. బిజెపి నాయకుల చేతుల్లో మోసపోయిన వారికి నేటికీ న్యాయం జరగని విషయం విస్మయంగొలుపుతోంది.



మాకవరపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బాధితులు

ఎయు ఉద్యోగుల జీతాలు వెంటనే చెల్లించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : ఆంధ్రా యూనివర్సిటీ ఉద్యోగుల జీతాలు చెల్లింపునకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జులై నెల ప్రారంభమై మూడు రోజులవుతున్నా ఇంతవరకు ఉద్యోగులకు జీతాలు చెల్లించలేదన్నారు. ఎయు విసి రాజీనామా వల్ల జీతాలు ఆగిపోవడం ఉద్యోగులను ఇబ్బంది పెట్టే చర్యని తెలిపారు. విసి లేకపోయినా ఎయు పరిపాలన, కార్యకలాపాలు ఆటంకం లేకుండా సాగుతున్నప్పుడు ఉద్యోగుల జీతాల చెల్లింపునకు ఆటంకాలు ఎందుకని ప్రశ్నించారు. సకాలంలో జీతాలు అందకపోవడం వల్ల ఉద్యోగుల కుటుంబం మీద, ఎయు కార్యకలాపాల మీద ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు. ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి ఉద్యోగుల జీతాలు వెంటనే చెల్లించాలని కోరారు.

మెడికవర్‌లో అరుదైన రోబోటిక్ శస్త్రచికిత్స

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నంలోని ప్రముఖ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ అయిన మెడికవర్‌లో వైద్యులు 77 ఏళ్ల వయసు కలిగిన ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ రోగిని రక్షించడానికి ప్రత్యేకమైన రోబోటిక్ సహాయంతో చేపట్టిన శస్త్రచికిత్స విజయవంతం అయినట్టు ఆసుపత్రి యాజమాన్యం తెలిపింది. సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం డైరెక్టర్ డాక్టర్ బిశ్వబసు దాస్ నేతృత్వంలో ఈ శస్త్రచికిత్స జరిగినట్టు పేర్కొంది. బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ దాస్ ఆ వివరాలను మీడియాకు వెల్లడించారు. 'విప్పుల్ ప్రొసీజర్' అని పిలవబడే ఈ శస్త్రచికిత్సను యుఎస్ కేంద్రంగా కలిగిన ఇంట్యూటివ్ రూపొందించిన అత్యుత్తమ రోబోటిక్ సహాయక శస్త్రచికిత్స వ్యవస్థలో ఒకటైన డావిన్సీ సహాయంతో చేశామన్నారు. ఈ అరుదైన ప్రక్రియను ప్రపంచవ్యాప్తంగా కొద్దిమంది సర్జన్లు మాత్రమే చేశారని చెప్పారు.

ఇగ్నో అడ్మిషన్ల గడువు పెంపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) జులై - 2024 విద్యాసంవత్సరానికిగానూ వివిధ దూరవిద్యా కోర్సులతోపాటు ఆన్‌లైన్ కోర్సులలో ప్రవేశాల కోసం గడువును ఈ నెల 15వ తేదీ వరకూ పెంచిందని వర్సిటీ సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. విశ్వ విద్యాలయం అందిస్తున్న అన్ని సర్టిఫికెట్, డిప్లొమా, పిజి డిప్లొమా, డిగ్రీ,, అన్ని పీజీ కోర్సులలో ప్రవేశాలు జులై 15వ వరకు లభిస్తాయని వెల్లడించారు. https://ignouadmission.samarth.edu.in ద్వారా అడ్మిషన్లు పొందవచ్చునని తెలిపారు. విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం పరిధిలోని 11 జిల్లాల్లో ఉన్న అధ్యయన కేంద్రాలన్నింటిలో ఈ విద్యా సంవత్సరానికిగానూ ప్రవేశాలు పొందే వీలుందని పేర్కొన్నారు. ప్రవేశాలన్నీ ఆన్‌లైన్ విధానం ద్వారా మాత్రమే అందుబాటులో ఉంటాయన్నారు.

మహారాజశ్రీ విజయనగరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.ఏ. 60/2023 ఓ.యస్. 267/2013.

సూరు శ్రీనివాసరావు .....పిటిషనరు
ఎదిరి
అంధవరపు భాగ్యలక్ష్మి (లేటు) వగైరా...రెస్పాండెంట్స్

10వ రెస్పాండెంట్: అంధవరపు సత్యన్నారాయణ తండ్రి లేటు జనార్ధనరావు, ప్రస్తుత నివాసము విశాఖపట్నం సిటీ మరియు జిల్లా.

ప్రకటన

పైనెంబరు దావా వాది ప్రతివాదులపై మహారాజశ్రీ విజయనగరం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో దాఖలు చేసినారు. పైనెంబరు దావాలో ఒకటవ ప్రతివాది చనిపోయినందున ఆమె వారసులను దావాలో కోర్టు ఆర్డరు ప్రకారము చేర్చినాడు. పై నెంబరు దావాలో 10వ రెస్పాండెంట్/ప్రతివాదికి నోటీసులు అందనందున కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము ఈ ప్రకటన ఇచ్చుచున్నారు. సదరు కోర్టు ఆర్డరు ప్రకారము పేపరు ప్రకటన అంశములు ప్రకారము ఐ.ఏ.60/2023 ఓ.యస్.267/2013 గలది **తే.15-7-2024 దీన** మహారాజశ్రీ విజయనగరం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో వాయిదా కలదు. సదరు వాయిదాకు 10వ రెస్పాండెంట్ అయిన అంధవరపు సత్యన్నారాయణ తండ్రి లేటు జనార్ధనరావు, నివాసము చీపురుపల్లి, ప్రస్తుతము విశాఖపట్నం వారు పర్సనల్ గాగాని, ప్లీడరు గారి ద్వారా గాని **తే.15-7-2024 దీన ఉదయం గం.10-30 నిముషములకు** విజయనగరం కోర్టులో హాజరు కావలసి యున్నది. లేనియెడల మీ పరోక్షములో దావా ప్రొసీడింగ్సు జరుపబడును అని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

చీపురుపల్లి. **సి.హెచ్.వేణుగోపాలరావు**
తేది : 3-7-2024 న్యాయవాది, చీపురుపల్లి

పత్రికా ప్రకటన
మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టులో, తాడేపల్లిగూడెం
I.A. 584/23, O.S. 80/2016

Between:
భీముని వెంకటరమణ, వగైరాలు -పిటీషనర్స్
మరియు
కరణం అప్పారావు వగైరాలు -రెస్పాండెంట్స్

R-14: అరిగే రామానుజాచార్యులు, S/o. అప్పల సూర్యారావు, వయస్సు 54 సం॥లు, R/o. విశాలాక్షి నగర్, విశాఖపట్నం.

R-15: అరిగే తేజ, S/o. రామానుజాచార్యులు, వయస్సు 30 సం॥లు, R/o. విశాలాక్షి నగర్, విశాఖపట్నం.

పై నెంబరు గల పిటిషన్‌లో పిటిషనర్, రెస్పాండెంట్స్ అయిన మీరు R14, R15 కి ఎన్నిమార్లు పిటిషన్ నోటీసులు మీకు పంపిన అమలు కాని కారణంగా శ్రీ కోర్టు వారు ఆర్డరు ప్రకారం మీకు పిటిషన్ నోటీసులు పత్రికా ప్రకటన ద్వారా మీకు అమలుచేసే విధముగా పిటిషనర్ ఆర్డరు పొంది ఉన్నారు. కావున **వాయిదా తేది 12-7-2024 ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారు ఎదుట స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరు కాగలరు. లేనిచో మీ పరోక్షమందు పిటిషన్ తదుపరి చర్యలు జరుపబడును.

వాయిదా తేది: 12-7-2024

జి.వి.నాగేశ్వరరావు
జి.లక్ష్మయ్య
యమ్.శ్రీనుబాబు
తాడేపల్లిగూడెం న్యాయవాదులు, ఏలూరు

మహారాజశ్రీ శృంగవరపుకోట జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
OS 31/2022 IA 650/2023

Between :
వాకాడ సన్యాసిరావు (Died)
వాకాడ నాగరత్నం & Others .....వాదులు
And :
గర్భాం రాజేంద్రప్రసాద్ ...... ప్రతివాది

ప్రకటన

To
గర్భాం రాజేంద్రప్రసాద్, S/o అప్పల నరసింగరావు, R/o క్రిష్ణానగర్, వేపగుంట, విశాఖపట్నం జిల్లా.

పై దావాలో చనిపోయిన వాది వాకాడ సన్యాసిరావు వారసులుగా పిటిషనర్లు సకాలంలో పిటిషన్ దాఖలు చెయ్యనందున దావా abate అయినది. సదరు abatement set a side చెయ్యమని పిటిషనర్లు పై పిటిషన్ దాఖలు చేసియున్నారు. అందుకు మీకు ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టులో **తే 15-7-2024దీ హాజరయి ఉదయం గం॥ 10-30ని॥** లగాయతు ఖుద్దున గానీ, సరియైన భోగట్టా ఇవ్వబడిన న్యాయవాది ద్వారా గానీ తెలియపరుచుకొనవలెను.

ఇట్లు
మందా కామేశ్వరరావు
ఎస్.కోట న్యాయవాది, ఎస్.కోట
తేది : 3-7-2024 సెల్: 9441013505

మహారాజశ్రీ శృంగవరపుకోట జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
OS 31/2022 IA 651/2023

Between :
వాకాడ సన్యాసిరావు (Died)
వాకాడ నాగరత్నం & Others .....వాదులు
And :
గర్భాం రాజేంద్రప్రసాద్ ...... ప్రతివాది
To
గర్భాం రాజేంద్రప్రసాద్, S/o అప్పల నరసింగరావు, R/o కాకానగర్, కరాస, N.A.D కొత్తరోడ్డు దగ్గర, విశాఖపట్నం ....ప్రతివాది

నోటీసు

పై దావాలో చనిపోయిన వాది వాకాడ సన్యాసిరావుకి అతని భార్య నాగరత్నం కుమారులు ప్రసాదరావు, జగన్నాథరావులను వారసులుగా చేర్చమని పై కోర్టులో L.R.P దాఖలు చేసినందున అందుకు మీకు ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టులో **తే 15-7-2024దీన ఉదయం గం॥ 10-30ని॥** లగాయతు ఖుద్దున గానీ, సరియైన భోగట్టా ఇవ్వబడిన న్యాయవాది ద్వారా గానీ తెలియపరుచుకొనవలెను.

ఇట్లు
మందా కామేశ్వరరావు
ఎస్.కోట న్యాయవాది, ఎస్.కోట
తేది : 3-7-2024 సెల్: 9441013505

IN THE HON'BLE COURT OF THE VII SPECIAL MAGISTRATE AT: VISAKHAPATNAM
STC No.4794/2023

Between:
Neigapula Neehar ...Complainant
And:
Varna Bhoomi Developers,
Rep. by its Director
Sri Allena Neelam Naidu & another
...Accused

NOTICE

To
Accused No.1:
Varna Bhoomi Developers,
Rep. by its Director,
Sri Allena Neelam Naidu,
D.No.55-8-35/4, Flat No.14 & 15,
MIG-II,Seethammadhara,
Visakhapatnam-13.
Accused No.2:
Sri Allena Neelam Naidu,
Director of Varna Bhoomi Developers
D.No.55-8-35/4, Flat No.14 & 15,
MIG-II, Seethammadhara,
Visakhapatnam-13.

Please take notice that you are the accused 1 and 2 in the above case filed by the complainant under sections 138 and 142 of NI Act and the same is stands posted to **19-07-2024** for your notice and appearance. So, you are hereby informed to appear before this Hon'ble Court on **19-07-2024** at **10.30 A.M** either in person or through an advocate failing which ex-parte order passed against you and also the matter will be decided ex-parte.
(By Order of the Hon'ble Court)

N. JANARDHANA RAO,
P. HARI SHANKAR
Advocates, Visakhapatnam.

మానం ఆంజనేయనగర్‌లో రెవెన్యూ సర్వే

ప్రజాశక్తి-మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధిలోని మానం ఆంజనేయనగర్‌లో రెవెన్యూ అధికారులు బుధవారం ఇంటింటి సర్వే చేశారు. ఈ కాలనీలో నకిలీ పట్టాలతో పలువురు ఇళ్లు నిర్మించుకున్నారని కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, టిడిపి రాష్ట్ర వాణిజ్యవిభాగం కార్యనిర్వాహక కార్య దర్శి పిళ్లా వెంకటరావు విలేకర్ల సమావేశంలో ఆరోపించడంతో రెవెన్యూ యంత్రాంగం స్పందించి చినగదిలి మండలం రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ గోవింద్, పద్మనాభం మండల డిప్యూటీ తహశీల్దార్ కిశోర్, ఆర్‌డిఒ కార్యాలయం డిప్యూటీ తహశీల్దార్ సంజీవరావు మూడు బృందాలుగా ఏర్పడి సర్వే చేపట్టారు. మధురవాడ సర్వే నంబర్లు 125/పి, 126/2 లో అప్పటి ఎమ్మెల్యేలు మానం ఆంజనేయులు, పల్లా సింహాచలం 325 పట్టాలను పేదలకు ఇప్పించారు. 1998లో ఆ స్థలం ఎత్తుపల్లాలు, గోతులుగా ఉండడంతో కొందరు ఇళ్లు నిర్మించుకోలేదు. కాలక్రమంలో కొందరు ఇంటి స్థలాలను విక్రయించి వెళ్లిపోయారు. కార్పొరేటర్ ఆరోపణలతో బుధవారం అధికారులు ఇంటింటి సర్వే ప్రారంభించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఒక ప్రొఫార్మా అందించి వివరాలు సేకరించారు. పట్టా ఎప్పుడు ఇచ్చారు, లబ్ధిదారుని పేరు, ఆధార్ నెంబరు, పట్టానెంబర్, విద్యుత్ కనెక్షన్ నెంబరు, ఒకవేళ లబ్ధిదారుని నుంచి పట్టా కొనుగోలు చేస్తే ప్రస్తుత లబ్ధిదారుని వివరాలు, అమ్మిన వ్యక్తి వివరాలు సేకరిస్తున్నారు. సర్వేల్లో తెలిసిన వాస్తవ వివరాలు మేరకు నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు అందిస్తామని సర్వే చేసిన అధికారులు తెలిపారు.



ఆవులకు వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ ప్రశాంతి

చురుగ్గా లంపీస్కిన్ వ్యాక్సినేషన్

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం ఆర్ తాళ్లవలస పశు వైద్యశాల పరిధిలో లంపీ స్కిన్ వ్యాక్సినేషన్ కార్యక్రమం చురుగ్గా జరుగుతోంది. ఆవుల్లో శరీరంపై పొక్కులుగా వ్యాపించే లంపీ వ్యాధి నివారణకు జులై నెలంతా వ్యాక్సినేషన్ కార్యక్రమం జరుగుతుందని ఆర్.తాళ్లవలస పశు వైద్యాధికారి ఎస్.జి.ప్రశాంతి బుధవారం తెలిపారు. ఈ వ్యాధి ఒక ఆవు నుంచి మరో ఆవుకు వ్యాపిస్తుందని వివరించారు. ఇప్పటి వరకు సుమారు 75 ఆవులకు వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు.

సిసి రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న రెల్లిపేట గ్రామానికి గంగమ్మ గారి కల్లాల నుంచి కొత్తచెరువు గట్టుపై నుంచి వేసిన సిసి రోడ్డుకు మరమత్తు పనులు చేయాలని గ్రామానికి చెందిన కొంతమంది యువకులు బుధవారం పద్మనాభం ఎంపిడిఒకు వినతి అందించారు. ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి కరిగి చెరువులో దిగిపోవడంతో సిసి రోడ్డు పూర్తిగా మరమ్మతులకు గురైందని వివరించారు. ఈ రోడ్డుపై ప్రయాణం చేయడానికి గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారని చెప్పారు.

సిసి రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 43వ వార్డు పరిధి జగ్గారావు బ్రిడ్జి వద్ద శివాలయం ముందున్న రహదారిలో సిసి రోడ్డు నిర్మించారు. స్థానిక వార్డు కార్పొరేటర్ ఉషశ్రీ సిసి రోడ్డు నిర్మాణం కోసం గతంలో రూ.ఐదు లక్షలు మంజూరు చేయించారు. బుధవారం సిసి రోడ్డు నిర్మాణ పనులను పూర్తిచేశారు. పనులను కార్పొరేటర్ ఉషశ్రీ పరిశీలించారు.

అల్లూరి జయంతి ఏర్పాట్లపై అధికారుల పరిశీలన

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పాండ్రంగి గ్రామంలో జన్మించిన అల్లూరి సీతారామరాజు జయంతిని నిర్వహించడానికి వారం రోజులుగా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఈ పనులను టూరిజం రీజినల్ డైరెక్టర్ శ్రీనివాసరావు, టూరిజం ఇన్ఫర్మేషన్ అధికారి జ్ఞానవేణి, భీమిలి ఆర్‌డిఒ భాస్కర్‌రెడ్డి తదితరులు పరిశీలించారు.

కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి

ప్రజాశక్తి -పద్మనాభం: మండలంలోని పాండ్రంగి గ్రామంలో అల్లూరి నివాసం గృహం, అల్లూరి పార్కు, అల్లూరి సామాజిక వేదిక అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసి క్షత్రియ సంఘానికి అప్పగించారు. ఈ నిధులతో పాత విగ్రహాలను తొలగించి కొత్త విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. పరిశుభ్రత కార్యక్రమాలు పది రోజులుగా చేపట్టారు.

అపోలోలో అరుదైన శస్త్ర చికిత్స

ప్రజాశక్తి - ఆరిలోవ : అపోలోలో అరుదైన సికిల్‌సెల్ ఎనీమియాకు బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు ఆసుపత్రి మెడికల్ ఆంకాలజీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ రాకేష్ రెడ్డి బోయిన తెలిపారు. 16 ఏళ్ల యువకుడు ఎం.యువరాజు 4 సంవత్సరాల వయస్సు నుంచి తీవ్రమైన సికిల్‌సెల్ అనీమియాతో బాధపడుతున్నాడని చెప్పారు. నోటి ద్వారా వేసే మందులకు ప్రతిస్పందన లేకపోవడంతో రక్త మార్పిడి, ఎముకల నొప్పి నివారణకు ఆసుపత్రిలో పదేపదే చేరేవాడని తెలిపారు. ఈ క్రమంలో అతని కుటుంబీకులు అపోలో ఆసుపత్రికి వచ్చి తమను సంప్రదించారని చెప్పారు. ఈ వ్యాధికి బోన్ మ్యారో (స్టెమ్ సెల్) మార్పిడి మాత్రమే నివారణ అని కుటుంబ సభ్యులకు తెలిపానని వివరించారు. రోగి అన్నయ్యను దాతగా గుర్తించామని, అది పూర్తిగా సరిపోలనప్పటికీ, మార్పిడి కోసం చికిత్స ప్రోటోకాల్‌లో కొన్ని మార్పులు చేసినట్లు తెలిపారు. అధిక మోతాదు కీమోథెరపీని నివారించడానికి జాగ్రత్తలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. మొత్తం శరీర రేడియేషన్‌తో రోగ నిరోధక శక్తిని అణిచివేసేందుకు క్యాంపత్ ఉపయోగించబడిందని తెలిపారు. ఇప్పుడు రెండు నెలల పోస్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్ తరువాత యువరాజు సికిల్ సెల్ అనీమియా సమస్య లేకుండా బాగానే ఉన్నట్టు వివరించారు. ఎపిలో స్టెమ్‌సెల్ మార్పిడితో సికిల్ సెల్ అనీమియాను విజయవంతంగా నయంచేసిన మొదటి కేసుగా అభివర్ణించారు. డాక్టర్ రాకేష్ రెడ్డి బోయినతో పాటు డాక్టర్ ప్రదీప్ వెంట్రపతి, డాక్టర్ సమన్ దాస్, డాక్టర్ వేణిప్రసన్న గేదెల, డాక్టర్ రహీం, నర్సింగ్ సిబ్బంది ఈ శస్త్ర చికిత్సలో పాల్గొన్నారు.

బృహత్తర ప్రణాళికతో గాజువాక అభివృద్ధి : పల్లా

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తెలిపారు. గాజువాక జోనల్ కార్యాలయంలో వార్డుల కార్పొరేటర్లు, అధికారులతో బుధవారం ఆయన తొలిసారిగా సమీక్ష నిర్వహించారు. విద్యుత్, తాగునీరు, పార్కులు, డ్రెయినేజీ వ్యవస్థ, క్రీడా మైదానాలు, రోడ్లు తదితర అంశాలపై రెండున్నర గంటల పాటు సమీక్ష జరిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, గాజువాకను రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో తాను పనిచేస్తానని చెప్పారు. శాఖలన్నింటినీ సమన్వయ పరచి అభివృద్ధి కార్యక్రమాలను దశల వారీగా చేపడతామని తెలిపారు. వ్యవస్థలన్నింటినీ ప్రక్షాళన చేయడం ద్వారా అభివృద్ధి మరింతగా మెరుగుపడుతుందన్నారు. జోనల్ కమిషనర్ బంటు సన్యాసినాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

విద్యార్థులకు పొదుపుపై అవగాహన



విద్యార్థులకు పొదుపుపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి ఫౌండేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి -పద్మనాభం: మండలంలోని పాండ్రంగి గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బుధవారం అల్లూరి జయంతి సందర్భంగా ప్రకృతి ఫౌండేషన్ ఆధ్వర్యాన 221 మంది విద్యార్థులకు పొదుపు అలవాటు చేసుకునేందుకు డబ్బీలు పంపిణీ చేశారు. ప్రకృతి ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీకాంత్, నరసింహారావు డబ్బీలు కొనుగోలు చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. జాతీయ అల్లూరి సేవా సంఘం అధ్యక్షులు సత్యనారాయణరాజు, కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ, అల్లూరి విగ్రహాలను అండమాన్, కర్ణాటక, కేరళ, ఉత్తరాఖండ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా ముగ్గురు విద్యార్థులకు రూ.516 చొప్పున ఆర్థిక సహాయాన్ని శ్రీకాంత్ అందించారు. ఈ కార్యక్రమంలో అనంత పద్మనాభస్వామి సేవా సంఘం అధ్యక్షులు దంతులూరి గోపాలకృష్ణమూర్తి రాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జివి.గిరి. సినీ డైరెక్టర్ గిరి చిన్న తదితరులు పాల్గొన్నారు.

డైట్‌లో ప్లాస్టిక్ బ్యాగ్‌ల రహిత దినోత్సవం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో బుధవారం అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగుల రహిత దినోత్సవం నిర్వహించారు. ఈ మేరకు అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు ప్ల కార్డులను ప్రదర్శిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. డైట్ ప్రిన్సిపల్ ఎం.జ్యోతికుమారి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గతంలో వాడిన లోహ పాత్రలు, చెక్క స్థానంలో ప్లాస్టిక్ వస్తువులు చేరి చివరకు మానవాళికి ముప్పు కలిగించేలా పరిణమించినట్లు వివరించారు. డైట్ అధ్యాపకులు, పర్యావరణ కార్యకర్త గొట్టేటిరవి, అధ్యాపకులు ఎల్.సుధాకర్, జిఐఎస్ నాగేశ్వరరావు, జి.మాధవి, ఎస్.త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఆస్తి కోసం అన్నను చంపిన తమ్ముళ్లు - యలమంచిలిలో ఘటన

ప్రజాశక్తి -ఎస్.రాయవరం : ఆస్తి కోసం పెద్దనాన్న కుమారుడైన అన్ననే హతమార్చి, పూడ్చిపెట్టిన దారుణ ఘటన యలమంచిలిలో సంచలనం రేపింది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలివి. మండలంలోని యలమంచిలి గ్రామం భవనం వీధికి చెందిన సున్నం సతీష్ (45) బంగారం వ్యాపారి. గత నెల 27న శుక్రవారం రాత్రి సున్నం సతీష్ పినతండ్రి కొడుకులైన సున్నం మనోజ్, దేవపల్లి రాజేష్‌లు తన పెదనాన్న కుమారుడైన సున్నం సతీష్ ఇంటికి వచ్చి అతనిపై దాడి చేసి హతమార్చారన్నారు. మృతదేహాన్ని శనివారం ఉదయం యస్ రాయవరం మండలం దార్లపూడి గ్రామం వద్ద పోలవరం కాలువ ఫిల్లర్ వద్ద పూడ్చి పెట్టారన్నారు. మృతుడి సతీష్ ఆచూకి తెలియకపోవడంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తమదైన రీతిలో అనుమానితులను ప్రశ్నించగా, నిందితులు తమ తప్పును ఒప్పుకుని, తాము మృతదేహాన్ని పాతిపెట్టిన ప్రదేశాన్ని పోలీసులకు చూపించారు. బుధవారం మధ్యాహ్నం మృతదేహాన్ని వెలికి తీసిన పోలీసులు, స్థానిక తహశీల్దారు జయలక్ష్మి సమక్షంలో పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. యలమంచిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి మలేరియా విభాగంలో ఎఎన్ఎంగా సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన పద్మావతిని జోన్ 8 మలేరియా ఇన్‌స్పెక్టర్ దాలినాయుడు ఆధ్వర్యాన సిబ్బంది సత్కరించారు. ఈ కార్యక్రమంలో జోన్ 8 మెడికల్ అధికారి డాక్టర్ కృష్ణంరాజు, శానిటేషన్ సూపర్‌వైజర్ రమణ, వెంకటస్వామి, జివిఎంసి సిబ్బంది పాల్గొని పద్మావతి సేవలను కొనియాడారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-యంత్రాంగం

వేపగుంట : 33/11 కెవి సబ్‌స్టేషన్ పద్మనాభపురం, 11కెవి బంటాకాలనీ ఫీడర్‌పై కొత్త విద్యుత్ లైన్ నిర్మాణ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఇఇ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. శుక్ర వారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బంటాకాలనీ, మేఘాద్రిగెడ్డ కాలనీ, అప్పలనరసయ్య కాలనీ, వెంకటసాయినగర్, రవినగర్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

మధురవాడ : శివశక్తినగర్ ఫీడర్‌పై శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు జోన్ -3 డిఇ పి.శ్రీనివాసరావు, ఎఇ రామూర్తి తెలిపారు. మారికవలస జెఎన్ఎన్‌యుఆర్ఎం హౌసింగ్ కాలనీ, వైఎస్ఆర్. కాలనీ, గాయత్రీ విద్య హాస్పిటల్, కార్పెంటర్స్ కాలనీ, వికలాంగుల కాలనీ, శివశక్తినగర్ రోడ్, అయ్యప్పనగర్, శ్రీలక్ష్మి నగర్, సద్గురుసాయి నాథ్ కాలనీ, గణేష్‌నగర్ రోడ్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అన్న క్యాంటీన్ల పునర్నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి -గోపాలపట్నం : ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశానుసారం విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు సూచనల మేరకు జివిఎంసి 92వ వార్డు రైతు బజార్ సమీపంలోని అన్నా క్యాంటీన్ పునర్నిర్మాణం కోసం బుధవారం తెలుగుదేశం పార్టీ నాయకులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా 89వ వార్డు కార్పొరేటర్ దాడి రమేష్ మాట్లాడుతూ, తెలుగుదేశం హయాంలో బ్రహ్మాండంగా నిర్వహించిన అన్నా క్యాంటీన్ గత ప్రభుత్వంలో మూతపడ్డాయని, మరలా వాటి పునర్నిర్మాణం కోసం ఎమ్మెల్యే గణబాబు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు మూర్తి పట్నాయక్, 92వ వార్డు అధ్యక్షుడు నార్పిని సత్తిరాజు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు మహిళా నాయకులు పాల్గొన్నారు.

చెత్త తరలింపు వాహనం ప్రారంభం

ప్రజాశక్తి- గాజువాక : జివిఎంసి జోన్-6 పరిధిలో చెత్త తరలింపునకు ఏర్పాటు చేసిన కొత్త వాహనాన్ని (టిప్పర్) ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు జోనల్ కార్యాలయం వద్ద బుధవారం ప్రారంభించారు. జోనల్ కమిషనర్ బంటు సన్యాసినాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, నియోజకవర్గ పరిధిలో శుభ్రతకు పెద్దపీట వేయాలన్నారు. ఆరోగ్య సమాజ స్థాపనలో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జోనల్ పరిధిలోని కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.



జివిఎంసి పీడీ పాపారావుకు, డిప్యూటీ మేయర్ సతీష్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

టిడ్కో ఇళ్లకు తీసుకున్న డబ్బులివ్వాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : తాటిచెట్లపాలెం ఎఎస్ఆర్.నగర్‌లో ప్రభుత్వం నిర్మించిన టిడ్కో ఇళ్లలో ఫ్లాట్లు ఇస్తామని ఒక్కొక్కరి నుంచి రూ. 4.70 లక్షలను వైసిపి నాయకులు శ్రీరాములు వసూలుచేశారని, ఆ డబ్బులను బాధితులకు తిరిగి ఇవ్వాలని సిపిఎం అక్కయ్యపాలెం జోన్ నాయకులు యుఎస్ఎన్.రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు జివిఎంసి పీడీ పాపారావుకు, డిప్యూటీ మేయర్ కట్టమూరి సతీష్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం రాజు మాట్లాడుతూ, వైసిపి నేత బంధువునని, ఇల్లు ఇప్పిస్తానని 14 మంది వద్ద రూ.65 లక్షలు వసూలు చేశారని తెలిపారు. ఈ డబ్బులు తిరిగి ఇచ్చేంత వరకు పోరాడుతామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో అక్కయ్యపాలెం జోన్ 45వ వార్డు సిపిఎం అధ్యక్షులు గౌరీష్, నాయకులు రాజు, అప్పలరాజు, వెంకన్న, బాధితులు పాల్గొన్నారు.



లీలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న భెల్ సిఐటియు నాయకులు

భెల్ ఎజిఎం లీలను కలిసిన సిఐటియు

ప్రజాశక్తి -గాజువాక : హైదరాబాద్ బిహెచ్ఇఎల్ నుంచి విశాఖ భెల్ యూనిట్‌కు వచ్చిన ఎజిఎం హెచ్ఆర్ ఎస్.లీలను సిఐటియు నాయకులు బుధవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆమెను కలిసిన వారిలో భెల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి జిటిపి.ప్రకాష్, ఎస్.జగన్నాధరావు, కె.విజయకుమార్, ఎస్.అప్పారావు, కె.నారపరెడ్డి, సిహెచ్.నారాయణ, జి.అచ్చంనాయుడు, పి.శివరాం ఉన్నారు.

రాంగ్ పార్కింగ్ చేస్తే జరిమానా

ప్రజాశక్తి- ములగాడ : వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తూ రాంగ్ పార్కింగ్ చేస్తే జరిమానా తప్పదని మల్కాపురం ట్రాఫిక్ సిఐ షణ్ముఖరావు హెచ్చరించారు. మల్కాపురంలోని పలు ప్రాంతాల్లో బుధవారం రాంగ్ పార్కింగ్‌లో ఉన్న వాహనాలను అదుపులో తీసుకొని జరిమానాలు విధించారు. కొన్ని ప్రాంతాల్లో గుర్తుతెలియని వాహనాలు ఉన్నాయని, వాటిని క్రైమ్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మల్కాపురం ట్రాఫిక్ ఎస్ఐ పాల్గొన్నారు.

కళాకారులకు భవనం నిర్మించాలి

పల్లాకు జీమా సభ్యుల వినతి

ప్రజాశక్తి -ములగాడ : కళాకారులకు భవనం కల్పించాలని కోరుతూ గాజువాక మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (జీమా) సభ్యులు బుధవారం గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి త్వరలోనే సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఆగస్టు 18వ తేదీన జీమా వార్షికోత్సవ వేడుకలకు పల్లాను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పైడిరాజు నూనెల, గుడివాడ శ్రీనివాసరావు, పుకోటి వెంకటేశ్వరరావు, అల్లు జోగినాయుడు, సర్వసుధ అప్పారావు, శరత్ కుమార్, కె.మంగ, జ్యోతి కుమారి తదితరులు పాల్గొన్నారు.



పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న జీమా సభ్యులు

వార్డుల్లో జివిఎంసి కమిషనర్, ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి-గోపాలపట్నం : జివిఎంసి 89, 92 వార్డుల పరిధి కొత్తపాలెం ఎర్రచెరువు, గోపాలపట్నం ప్రాథమిక ఉన్నత పాఠశాల తదితర ప్రాంతాలలో జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్‌వర్మ, పశ్చిమ ఎమ్మెల్యే పిజివిఆర్ నాయుడు (గణబాబు), జివిఎంసి అధికారులతో కలిసి పర్యటించారు. ముందుగా గోపాలపట్నం ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో మహాత్మా గాంధీ విగ్రహానికి కమిషనర్, ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళి లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ, గోపాలపట్నం హైస్కూలు స్వర్ణోత్సవాలు జరుపుకుందని, ఇక్కడి నుంచి ఎంతోమంది క్రీడాకారులు జాతీయస్థాయిలో పలు క్రీడల్లో రాణించారని తెలిపారు. ఈ స్కూల్లో ఉన్న క్రీడా మైదానంలో లైటింగ్‌తో కూడిన వాకింగ్ ట్రాక్, స్కేటింగ్ రింక్, 100 మీటర్ల క్రీడా మైదానం తదితరాలను అభివృద్ధి చేయాలని కమిషనర్‌ను ఎమ్మెల్యే కోరారు. కమిషనర్ స్పందిస్తూ పరిశీలిస్తామన్నారు.

89వ వార్డులోని కొత్తపాలెం ఎర్ర చెరువును వారు సందర్శించారు. ఎర్ర చెరువులో పూడికలు తొలగించి అభివృద్ధి చేయాలని కమిషనర్‌ను ఎమ్మెల్యే కోరారు. పరిశీలించి చర్యలు చేపడతామని ఎమ్మెల్యేకు కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో జివిఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, పట్టణ ప్రణాళిక అధికారి ఇ.సురేష్‌కుమార్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, జోనల్ కమిషనర్ హేమావతి, పర్యవేక్షక ఇంజినీర్లు కెవిఎన్.రవి, రామ్ మోహనరావు, కార్యనిర్వాహక ఇంజినీర్లు రత్నాకర్, ఏడుకొండలు, ఏడి హెచ్.సురేష్, ఏసీపీ రఘునాథరావు, 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకట రమేష్, వార్డు అధ్యక్షుడు విజయ్‌కుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



వార్డుల్లో పర్యటిస్తున్న జివిఎంసి కమిషనర్ సాయికాంత్‌వర్మ, ఎమ్మెల్యే గణబాబు

కవి సమ్మేళనంలో వైవిధ్యభరితమైన కవితలు

ప్రజాశక్తి-సీతమ్మధార : సహృదయ సాహితీ ఆధ్వర్యాన ప్రిజం కళాశాలలో జరిగిన కవిసమ్మేళనంలో వైవిధ్యభరితమైన కవితలను రచయితలు ఆలపించి అలరించారు. సాహితీ సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ, కవులు భావం, భాష, అలంకారాలు, సందేశం మొదలైనవాటిపై దృష్టి పెట్టి రచనలు చెయ్యాలన్నారు. ప్రముఖ రచయిత బలివాడ కాంతారావు తెలుగువారు గర్వించదగ్గ రచయిత అన్నారు. బలివాడ కాంతారావు జయంతి సందర్భంగా డాక్టర్ కెజి వేణు మాట్లాడుతూ, తెలుగు నవల, కథా సాహిత్య చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేకమైన అధ్యాయాన్ని సృష్టించుకున్న సుప్రసిద్ధ రచయిత బలివాడ కాంతారావు అని పేర్కొన్నారు. బాల్యంలోనే స్కూలు మేగజైనుకు సంపాదకులుగా పనిచేసిన ఘనత ఆయనిదన్నారు. బలివాడ కాంతారావు 38 నవలలు, 400 కథలు, 5 నాటికలు, మరెన్నో రేడియో నాటికలు రాశారని తెలిపారు. జన్మభూమి, వంశధార, దగాపడిన తమ్ముడు, సంపంగి, మరో రాజశేఖర చరిత్ర తదితర 13 సుప్రసిద్ధమైన నవలలు, అడవి మనిషి అజంతా, ఎల్లోరా మొదలైన నాటకాలు ఆయనకు ఎనలేని ఖ్యాతిని తీసుకొచ్చాయని వివరించారు. దగా పడిన తమ్ముడు నవలను నేషనల్ బుక్ ట్రస్ట్ అన్ని భారతీయ భాషల్లోకి అనువాదం చేయించిందని తెలిపారు. 1998లో విశాలాంధ్ర ప్రచురించిన బలివాడ కాంతారావు కథల సంకలనానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించిందన్నారు.

తెలుగు సాహిత్యంలో ఒక ధ్రువతారగా వెలిగిన కాంతారావు 1927 జులై 3న జన్మించారని, 2000 మే 6న కన్నుమూశారని తెలిపారు. విశిష్ఠ అతిథి డాక్టర్ డివి సూర్యారావు మాట్లాడుతూ, కవులకు సాహిత్య పరిచయం అవసరం అన్నారు. గౌరవ అతిథిగా డాక్టర్ సూరపనేని విజయకుమార్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.చినసూర్యనారాయణ, కుప్పిలి భీమేశ్వరరావు, డాక్టర్ కెవిఎన్.మూర్తి, పివిఆర్.కుమారరావు, పరమేశ్వరరావు, బి.రాధారాణి, సురేష్, కెజి.వేణు, శేఖరమంత్రి ప్రభాకర్, డివి.సూర్యారావు, డిఎస్.కుమార్ కవితలు చదివి అందరిని అలరించారు. కవితలను డాక్టర్ కెజి వేణు సమీక్షించారు.

ఆసుపత్రిలో పింఛన్ పంపిణీ

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 94వ వార్డు పరిధిలోని 489 సచివాలయం పరిధిలోని సామాజిక పింఛన్‌దారుడు మహ్మద్ అజీమ్ తగరపువలస సమీపంలోని అనిల్ నీరుకొండ ఆసుపత్రిలో చికిత్సపొందుతుండటంతో సచివాలయ వెల్ఫేర్ అధికారి పట్నాల లావణ్యశ్రీ అక్కడికి వెళ్లి పింఛన్ అందించారు. ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా లావణ్యశ్రీ ఏకంగా 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేయడంతో లబ్ధిదారుని కుటుంబీకులు ఆమె సేవా స్ఫూర్తిని కొనియాడారు.



ఆసుపత్రిలో పింఛన్ అందిస్తున్న లావణ్యశ్రీ

నేడు నీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -గాజువాక : వడ్లపూడి నిర్వాసిత కాలనీ మొత్తానికి గురువారం నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని జివిఎంసి ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.కూర్మన్నపాలెం వద్ద రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో పైప్‌లైన్లు మార్చాల్సి ఉందని, దానివల్ల తాగు నీరు సరఫరా చేయలేమని పేర్కొన్నారు.

ఎమ్‌వివిఎస్.మూర్తికి ఘన నివాళి



మూర్తి స్మృతివనం వద్ద నివాళులర్పిస్తున్న గీతం సిబ్బంది

ప్రజాశక్తి-మధురవాడ : గీతం విద్యాసంస్థల వ్యవస్థాపకుడు, విశాఖ మాజీ ఎంపీ డాక్టర్ ఎమ్‌వివిఎస్.మూర్తి 86వ జయంతిని బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. గీతం ప్రాంగణంలోని డాక్టర్ మూర్తి విగ్రహం వద్ద, గీతం సమీపంలోని డాక్టర్ మూర్తి స్మృతి వనం వద్ద గీతం అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది నివాళి లర్పించారు. గీతం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎమ్.గంగాధరరావు మాట్లాడుతూ, రాజకీయ, సామాజిక, సేవారంగాలలో విశేష కృషిచేసిన డాక్టర్ ఎమ్‌వివిఎస్.మూర్తి దేశ ఉన్నత విద్యారంగంలో ఆంధ్రప్రదేశ్‌ను గీతం విద్యాసంస్థల ద్వారా అగ్రస్థానంలో నిలిపారని కొనియాడారు. గీతం విశాఖ, హైదరాబాద్, బెంగళూరు ప్రాంగణాల ద్వారా వేలాది మంది వృత్తి నిపుణులను దేశానికి అందించారన్నారు. గాంధీ మార్గంలో ప్రయాణించడం పట్ల ఆసక్తి కనబరిచేవారని అందుకే గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్ మెంట్‌గా (గీతం) నెలకొల్పారని తెలిపారు.

గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధ వట్టం మాట్లాడుతూ, సైన్స్ విజ్ఞానానికి పెద్దపీట వేయాలనే డాక్టర్ మూర్తి ఆశయ సాధనకోసం రూ.100 కోట్లతో మూర్తి ప్రయోగశాలలు నెలకొల్పామని, ఏటా ప్రతిభ గల పరిశోధకులను గుర్తించి మూర్తి ఫెలోషిప్‌లను అందజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో గీతం ప్రో-వైస్ ఛాన్సలర్లు ప్రొఫెసర్ వై.గౌతమరావు, డాక్టర్ బి.గీతాంజలి, రిజిస్ట్రార్ డాక్టర్ డి.గుణశేఖరన్, గీతం సలహాదారులు ప్రొఫెసర్ గొల్లు సూర్యనారాయణ, ప్రొఫెసర్ డి.హరినారాయణ, సీనియర్ ప్రొఫెసర్లు, డైరక్టర్లు, డీన్లు హాజరయ్యారు. డాక్టర్ మూర్తి స్మృతి చిహ్నం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.

విశాఖ కలెక్టరేట్ : విశాఖ అభివృద్ధిలో మాజీ ఎంపీ ఎంవివిఎస్.మూర్తి పాత్ర ఎంతో ఉందని టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి అన్నారు. కీర్తిశేషులు ఎంవివిఎస్.మూర్తి జయంతి సందర్భంగా బుధవారం టిడిపి జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి గండి బాబ్జి, పార్టీ దక్షిణ నియోజకవర్గం ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్ పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలమరశెట్టి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు గండి బాబ్జి తదితరులు

డ్వాక్రా మహిళలకు విఓఎ టోకరా

-సభ్యుల పేర్లపై సుమారు రూ.మూడు కోట్లు స్వాహా
-నోటీసులు జారీ చేయడంతో
-లబోదిబోమంటున్న మహిళలు
-పోలీసుల అదుపులో విఓఎ నసీమా

ప్రజాశక్తి-అనకాపల్లి

డ్వాక్రా మహిళలకు విఓఎ టోకరా వేసింది. డ్వాక్రా మహిళల పేర్లతో సుమారు రూ.3 కోట్లు స్వాహా చేసింది. తాము తీసుకోని రుణాలకు చెల్లించాలంటూ బ్యాంకుల్లో నుంచి నోటీసులు రావడంతో బాధిత మహిళలు బుధవారం బ్యాంకు ఆఫ్ ఇండియా ఎదుట ఆందోళన చేపట్టారు. దీంతో నకిలీ గ్రూపులను తయారు చేసి వారికి తెలియకుండానే పట్టణంలో వివిధ బ్యాంకుల నుంచి సుమారు మూడు కోట్ల రూపాయలను వివోఏ స్వాహ వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే... అనకాపల్లి మండలం కొత్తూరు గ్రామానికి చెందిన మహిళలకు రుణాలను చెల్లించాలంటూ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు నోటీసులు జారీ చేశారు. నోటీసులు చూసిన సభ్యులు నోళ్ళ వెళ్లబెట్టారు. లబోదిబోమంటూ నోటీసులను పట్టుకొని బ్యాంకులకు పరుగులు పెట్టారు. ఆ రుణాలను తాము తీసుకోలేదని తెలియజేశారు. విఓఎ నసీమా తమకు తెలియకుండానే తమ పేర్లపైనా, చనిపోయిన వారి పేర్లపైనా రుణాలు మంజూరు చేయించడం, డ్రా చేయడం ఏ విధంగా జరిగిందని మేనేజర్‌ను మహిళలు ప్రశ్నించారు. దీనిపై బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ 2022 జనవరి నుంచి 2023 మార్చి వరకు 22 గ్రూపులకు మూడు కోట్ల 32 లక్షల 53 వేల రూపాయలను అప్పటి బ్యాంకు మేనేజర్ మంజూరు చేసినట్టు తెలిపారు. తాను బదిలీపై వచ్చిన తర్వాత లోన్ల రికవరీపై దృష్టి సారించి రుణాలు కట్టని వారికి నోటీసులు జారీ చేశామని చెప్పారు. దీంతో రుణాల అవకతవకలు వెలుగులోకి వచ్చాయని, ఈ విషయాన్ని ఇప్పటికే జిల్లా కలెక్టర్, డిఆర్డిఏ పిడి, పోలీస్ స్టేషన్లో నసీమాపై ఫిర్యాదు చేయడం జరిగిందని పేర్కొన్నారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా లాగే మరికొన్ని బ్యాంకుల్లో కూడా ఇలా రుణాలు తీసుకున్నట్టు వెలుగులోకి వస్తోందన్నారు. కాగా వివోఏ నసీమాను పోలీసులు స్టేషన్లో విచారిస్తున్నారు.



బ్యాంక్ ఆఫ్ ఇండియా ముందు ఆందోళన చేస్తున్న బాధిత డ్వాక్రా మహిళలు



మాట్లాడుతున్న డిఇఒ వెంకటలక్ష్మమ్మ

విద్యార్థుల్లో వెనుకబాటుతనం తగ్గించాలి

డిఇఒ వెంకటలక్ష్మమ్మ

ప్రజాశక్తి - కశింకోట

విద్యార్థుల్లో నెలకొన్న వెనుకబాటుతనం తగ్గించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట లక్ష్మమ్మ అన్నారు. కశింకోట బాలుర హైస్కూల్లో ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన టచ్ టూల్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం డిఇఒ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోధన సామగ్రి ఉపయోగించుకోవాలని సూచించారు. శిక్షణలో సమయపాలన పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంఒ పట్నాయక్, కోర్స్ డైరెక్టర్, ప్రధానోపాధ్యాయులు ఎంఆర్‌వి అప్పారావు, నారాయణరావు, అచ్యుతకృష్ణ, నూకేష్, వేణుగోపాల్, ఆనంద్, రవి పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న గ్రామీణ తపాలా ఉద్యోగులు

గ్రామీణ తపాలా ఉద్యోగులపై టార్గెట్లు నిలిపివేయాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : గ్రామీణ తపాలా ఉద్యోగులపై పోస్టల్ డిపార్ట్మెంట్ విధిస్తున్న టార్గెట్లు నిలిపివేయాలని బుధవారం అనకాపల్లి పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఆల్ ఇండియా డాక్ సేవక్ యూనియన్ (ఏఐటియుసి) ఆధ్వర్యంలో కేంద్ర యూనియన్ ఇచ్చిన పిలుపులో భాగంగా నిర్వహించిన ధర్నాలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వి దుర్గాప్రకాష్ మాట్లాడారు. అతి తక్కువ వేతనంతో సంస్థ కు అత్యధిక సంపద సృష్టించే జిడిఎస్‌ల మీద ప్రతిరోజు టార్గెట్లు విధిస్తూ మానసికంగా శారీరకంగా వేధిస్తున్న డిపార్ట్మెంట్ అధికారుల వైఖరి నిలిపివేయాలని డిమాండ్ చేశారు. వీరి కారణంగానే గ్రామీణ తపాల కార్మికులు రోగాల బారిన పడి చనిపోవడం జరుగుతుందని ఆవేదన వ్యక్తపరిచారు. రోజుకు నాలుగు గంటలు పనిచేయాలని జిడిఎస్‌ల చేత ఎనిమిది నుండి 10 గంటలు పనిచేస్తూ వెట్టిచాకిరి చేయిస్తున్నారని, అంతకుమించి టార్గెట్లు విధించి మానసిక వేధింపులకు గురిచేయడం వల్ల అకాల మరణాలు చెందాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. టార్గెట్ వేధింపులు మానుకోకుంటే జిడిఎస్‌లతో పెద్ద ఎత్తున ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటియూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు వైఎన్ భద్రం, యూనియన్ డివిజన్ అధ్యక్షులు ఎస్. సతీష్ కుమార్, కోశాధికారి పి. నూకరాజు దొర, ఎం నాగేశ్వరి, కే.మధు, గంగరాజు పాల్గొన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని పోస్టల్ అసిస్టెంట్ సూపరిండెంట్ సంజయ్ పాండాకు వినతిపత్రం అందజేశారు.

అల్లూరి విగ్రహం వద్ద చెత్త తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-అనకాపల్లి

మండలంలోని తుమ్మపాల గ్రామం మెయిన్ రోడ్‌లో ఆర్ఐసిఐఎస్ కార్యాలయం సమీపంలో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహం చుట్టూ ఉన్న చెత్త చెదారాన్ని బుధవారం ఉదయం పంచాయతీ సిబ్బంది తొలగించారు. ఇక్కడ అల్లూరి విగ్రహం చుట్టూ పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోయిన నేపథ్యంలో 'అల్లూరికి ఇచ్చే గౌరవం ఇదేనా?' ప్రజాశక్తి బుధవారం ప్రచురించిన వార్తకు పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. బుధవారం ఉదయాన్నే పంచాయతీ అధికారులు ఈ విగ్రహం చుట్టూ ఉన్న చెత్త చెదారం తొలగించి శుభ్రపరిచారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అల్లూరి విగ్రహం చుట్టూ శుభ్రపర్చిన దృశ్యం



ఆక్రమణలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ప్రభుత్వ గెడ్డలో ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని ఇరువాడ గ్రామ, సర్వే నెంబర్ 103, 106లో ప్రభుత్వ గెడ్డవాగులో కొంతమంది రియల్టర్లు చేసిన ఆక్రమణలను రెవెన్యూ అధికారులు బుధవారం తొలగించారు. ప్రభుత్వ గెడ్డ వాగు ఆక్రమణలపై గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయగా, రెవెన్యూ సిబ్బంది తక్షణమే స్పందించి భూమిని సర్వే చేసి గెడ్డలో నిర్మించిన ప్రహరీ గోడలను తొలగించారు. గెడ్డవాగును ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. భూ సరిహద్దులను గుర్తించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు వెంకట్, ఆర్ఐ వీరయ్య, మండల సర్వేయర్ కె.శ్రీనివాసరావు, వీఆర్వో, భూ రీ సర్వేయర్, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 28 మందికి జరిమానాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : మద్యం తాగి వాహనాలు నడిపిన 28 మందికి ఒక్కొక్కరికి పదివేల రూపాయల చొప్పున 2 లక్షల 80 వేల రూపాయల జరిమానా అనకాపల్లి 13వ ఎంఎం కోర్టు విధించినట్టు ఎస్పీ కేవీ మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహన తనిఖీలు చేస్తున్న సమయంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 28 మంది పట్టుబడ్డారు. వీరిని అనకాపల్లి, 13వ ఎంఎం కోర్టులో బుధవారం ప్రవేశపెట్టగా న్యాయమూర్తి బి.వి.విజయలక్ష్మి వాహనదారులకు ఈ జరిమానా విధించారు. కాగా అనకాపల్లి పట్టణ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి ట్రిపుల్ రైడింగ్, సెల్ఫోన్ డ్రైవింగ్ ద్విచక్ర వాహనదారులపై 21 కేసు నమోదు చేసినట్టు తెలిపారు. రోడ్డు భద్రత నియమాలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యతని, జిల్లా లోని ప్రతి ఒక్కరు రోడ్డు నియమాలను తప్పక పాటించాలని లేదా భారీ జరిమానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. మద్యం తాగి వాహనం నడపడం అత్యంత ప్రమాదకరం, ఇది తమ ప్రాణాలకు, ఇతరుల ప్రాణాలకు ప్రమాదం కలిగిస్తుందన్నారు. మద్యం సేవించిన వ్యక్తి డ్రైవింగ్ చేయడంపై సెక్షన్ 185 కింద మొదటి సారి నేరం చేస్తే రూ.10,000 జరిమానా, లేదా 6 నెలల జైలు శిక్ష, లేదా రెండును విధించవచ్చని పేర్కొన్నారు. రెండవ సారి నేరం చేస్తే రూ.15,000, లేదా 3 సంవత్సరాల జైలు శిక్ష, లేదా రెండును విధించవచ్చని తెలిపారు. వాహనం నడిపే సమయంలో వాహనదారులు రోడ్డు భద్రత, రహదారి నిబంధనలు తప్పక పాటించి ప్రమాదాలు, జరిమానాలు, శిక్షలకు గురి కాకుండా ఉండాలని కోరారు.

చెరువును తలపిస్తున్న ప్రధాన రహదారి

ప్రజాశక్తి-కశింకోట

మండలంలోని తాళ్లపాలెం సంత మార్కెట్ గ్రామం వద్ద తాళ్లపాలెం- నర్సీపట్నం రోడ్డు చెరువును తలపిస్తోంది. వర్షం పడితే రోడ్డుపై నీరు నిల్వ ఉండిపోయి చెరువులా కనిపిస్తోంది. ఈ మార్గంలో ప్రతి రోజు వందల సంఖ్యలో వాహనదారులు ప్రయాణం చేస్తూ ఉంటారు. ప్రధాన రహదారిపై నీరు నిల్వ ఉండిపోవడంతో ఆ మార్గంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు తడిసిపోతున్నారు. సోమవారం సంత రోజు మరి ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ తారురోడ్డు పక్కన నీరు పోవడానికి కాలువ తవ్వితే ఈ సమస్య పరిష్కారమవుతుంది. కాని అధికారులకు ముందుచూపు, పర్యవేక్షణ లేకపోవడంతో ఎటువంటి చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై నిల్వ ఉన్న నీటిని బయటకు పోయే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.



చెరువులా ఉన్న తాళ్లపాలెం-నర్సీపట్నం ప్రధాన రోడ్డు

గంజాయి అక్రమ రవాణా అరికట్టేందుకు పటిష్ట చర్యలు

జిల్లా ఎస్‌పి మురళీకృష్ణ

ప్రజాశక్తి- అనకాపల్లి

గంజాయి అక్రమ రవాణా, ఇతర డ్రగ్స్ నివారణకు 100 రోజుల ప్రత్యేక కార్యచరణలో భాగంగా బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గంజాయి కేసులను ఎస్పి మురళీకృష్ణ సమీక్షించి దర్యాప్తు అధికారులకు పలు సూచనలు చేశారు. ఆంధ్ర ఒడిషా బోర్డర్, ఏజెన్సీ ప్రాంతం నుండి రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, ఇతర రాష్ట్రాలకు గంజాయి అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన కేసులను సమీక్షించి దర్యాప్తు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. దర్యాప్తు అధికారులు గంజాయి కేసులను ప్రత్యేక శ్రద్ధ వహించి నేరాభియోగ పత్రాలను సంబంధిత కోర్టులో నమోదు చేయాలని, కేసులలో పురోగతిపై పి.పితో అనుసంధానంతో సదరు కేసులలో శిక్షలు పడేలా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎస్. అప్పలరాజు, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కె.వి. సత్యనారాయణ, నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ జి.ఆర్.ఆర్.మోహన్, ఇన్స్పెక్టర్లు లక్ష్మణ్ మూర్తి, గణేష్, కుమారస్వామి ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి మురళీకృష్ణ

తాగునీటి పథకాన్ని పునరుద్ధరించాలి

సిపిఎం నాయకులు వెంకన్న దొర

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని వాలాబు పంచాయతీ శివారు పాత వాలాబు గ్రామంలో నిరుపయోగంగా ఉన్న తాగునీటి పథకాన్ని పునరుద్ధరించి గ్రామస్తులకు మంచినీటి సౌకర్యం కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, మండల కార్యదర్శి బిటి దొర డిమాండ్ చేశారు. గ్రామంలో నిరుపయోగంగా ఉన్న తాగునీటి ట్యాంకును బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాతవాలాబులో సుమారుగా 250 వరకు జనాభా ఉంటుందని, జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయిలు మంజూరు చేసిన, రోజుకు గంటకు మంచి నీళ్ల ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికే గ్రామంలో ఉన్న తాగునీటి పథకం వాటర్ ట్యాంకును రిపేర్ చేయడం వల్ల గ్రామమంతటికీ మంచినీటి సౌకర్యం కలుగుతుందని తెలిపారు. ఈ తాగునీటి పథకం ఆరు నెలల నుండి పని చేయకపోయినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా ఎక్కువగా ఉండడంతో మంచినీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొన్ని సందర్భాల్లో కుళాయిలు పనిచేయకపోతే నానా అవస్థలు పడాల్సి వస్తుందని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ ట్యాంకును రిపేర్ చేయాలని కోరారు.



నిరుపయోగంగా ఉన్నవాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న దొర తదితరులు

అక్రమ కట్టడాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని బయ్యవరం గ్రామంలో 299 సర్వేనెంబర్లో చెరువును ఆనుకొని గత ప్రభుత్వం సమయంలో బయ్యవరం గ్రామానికి చెందిన వ్యక్తి అక్రమంగా ప్రభుత్వ స్థలంలో నిర్మించిన వ్యాపార సముదాయాలపై చర్యలు తీసుకోవాలని ఎన్‌డిఎ కూటమి నాయకులు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కశింకోట తహశీల్దార్, అనకాపల్లి ఆర్‌డిఓ, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణకు ఈ అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు ఎస్‌కె.బాబార్, చిట్టిపల్లి అప్పలనాయుడు, గొల్లవిల్లి ప్రవీణ్, శిరంశెట్టి వెంకట లక్ష్మి పాల్గొన్నారు.

రైతులకు వరి విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి -అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట రైతు భరోసా కేంద్రం ఆవరణలో బుధవారం గ్రామ సర్పంచ్ ఎస్ భాగ్యలక్ష్మి బాబినాయుడు, జనసేన పార్టీ నాయకుడు ఎస్ నాగార్జున చేతులమీదుగా రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, గ్రామ ఉపసర్పంచ్ బీశెట్టి రాము, పిఎసిఎస్ మాజీ ఉపాధ్యక్షులు కర్రి ఆదినారాయణ, వ్యవసాయశాఖ సిబ్బంది నీరజ తదితరులు పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం



ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని లింగాల తిరుగుడు బంగారమ్మ పాలెం గ్రామానికి చెందిన యువకుడు అదృశ్యమైనట్లు స్థానిక ఎస్సై ఆర్.ధనుంజయ్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... లింగాల తిరుగుడుకు చెందిన పిల్లి నాగరాజు (35) జూన్ నెలలో ఇంటి నుండి వెళ్లి తిరిగి రాలేదు. దీనిపై నాగరాజు భార్య పిల్లి కనక మహాలక్ష్మి సబ్బవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నాగరాజు ఆచూకీ కోసం గాలిస్తున్నమని ఎస్ఐ తెలిపారు.

పరవాడపాలెంలో వీధి దీపాలు ఏర్పాటు

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని పరవాడపాలెం గ్రామంలో బుధవారం వీధి దీపాలు ఏర్పాటు చేశారు. వీధుల్లో విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన లైట్లు కాలిపోవడంతో గ్రామం రాత్రి సమయంలో అంధకారంగా మారుతుంది. ఈ నేపథ్యంలో బుధవారం గ్రామ సర్పంచ్ బలిజి మంగ మునిలినాయుడు ఆధ్వర్యాన లైట్లు ఏర్పాటు చేశారు.

ఎన్‌సిసి అధికారి మూర్తికి కెప్టెన్‌గా ప్రమోషన్

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక ఎఎంఎఎల్ కళాశాలలో ఎన్‌సిసి ఆర్మీ విభాగంలో అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎఎస్‌ఎన్.మూర్తికి కెప్టెన్‌గా ప్రమోషన్ లభించింది. ఈ మేరకు బుధవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల కరెస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ గల్లా జయబాబు ప్రమోషన్ ర్యాంక్‌ను ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మూర్తి 2016లో ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ, కాంప్టి, నాగపూర్, మహారాష్ట్రలో 90 రోజులు ట్రైనింగ్ చేసి కమీషన్ కోర్స్ పూర్తి చేశారని తెలిపారు. తరువాత లెఫ్టినెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ 2022లో మరల అకాడమీలో 20 రోజులు రిఫ్రెషర్ కోర్స్ చేసి కెప్టెన్‌గా పదోన్నతిని పొందటం అభినందించవలసిన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కెవిఎస్ మహేశ్వరరావు, ఐక్యూఎసి కోఆర్డినేటర్ నిరంజన్, ఎన్‌సిసి అధికారులు కెప్టెన్ దాడి జగదీష్, లెఫ్టినెంట్ కొండలరావు, సూపరింటెండెంట్ అనురాధ, ఎన్‌సిసి ఆర్మీ క్యాడెట్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెప్టెన్ మూర్తిని కళాశాల యాజమాన్యం, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

వికలాంగుల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి- అనకాపల్లి : వికలాంగుల సమస్యలను అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణకు బుధవారం బాధిత వికలాంగులు విన్నవించారు. వికలాంగులకు గత ప్రభుత్వంలో ఆగిపోయిన పెన్షన్లు మంజూరు చేయాలని, 2016 వికలాంగుల చట్టం పూర్తిగా అమలు చేయాలని, ఏపీ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులలో నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించాలని, జాతీయ ఉపాధి హామీ పథకంలో ప్రత్యేక ఉపాధి కల్పించాలని, అంత్యోదయ రేషన్ కార్డులు, సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని, వికలాంగుల ఏడి కార్యాలయం అనకాపల్లిలో ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే రామకృష్ణ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో వికలాంగులు వెలగ బుజ్జి, రాపేటి భాస్కరరావు, బుద్ధ ధనలక్ష్మి, ఆడారి అన్నపూర్ణ, వి.శ్రీను, కృష్ణవేణి, బుగిడి నూకఅప్పారావు, షేక్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



తురకలపూడిలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తురకలపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి సంధ్యారాణి ప్రజలకు సూచించారు. మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పెదపూడి సచివాలయం పరిధిలోని గ్రామాల్లో నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అతిసార వ్యాధి పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని, వేడి నీటిని వడపోసుకుని తాగాలని సూచించారు. స్థానిక యూపీ స్కూల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

అనకాపల్లి : స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి కొట్ని వీధి అర్బన్ హెల్త్ సెంటర్, సిరసపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో చిన్నపిల్లలకు సీజనల్ వ్యాధులు రాకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, టానిక్స్ మందులను బుధవారం 84వ వార్డ్ కార్పొరేటర్ మాదంశెట్టి చిన్నతల్లి పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ జి నాగేంద్ర మాట్లాడుతూ చిన్నపిల్లలు సీజనల్ వ్యాధులు బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాదంశెట్టి నీలబాబు, తెలుగుదేశం జనసేన నాయకులు కొట్ని రాంబాబు, దుడ్డ నాగేశ్వరరావు, షేక్ రియాజ్, అయోధ్య వాసు, సిరసపల్లి సన్యాసిరావు, రాజు, సిహెచ్ దుర్గాప్రసాద్, సిరసపల్లి శ్రీను నూకరాజు తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రిలో పింఛను ఇస్తున్న సచివాలయ ఉద్యోగి

మండలంలో 99.34 శాతం పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-కె.కోటపాడు : సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ సంపూర్ణంగా జరిగిందని, మండలంలో 99.34 శాతం మంది లబ్ధిదారులకు వారి ఇళ్లకు వెళ్లి అందజేసినట్లు స్థానిక ఎంపీడీవో పట్నాయక్ తెలిపారు. అలాగే అనారోగ్య కారణాలతో ఆసుపత్రిలో ఉన్న వారికి కూడా పంపిణీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. సచివాలయ ఉద్యోగులు ఎంతో బాధ్యతాయుతంగా ఎక్కడ ఎటువంటి అవాంతరాలు లేకుండా పంపిణీ చేసినట్లు చెప్పారు. మండలంలో 11,002 పెన్షన్లు ఉండగా, ఇళ్ల వద్ద 10,929 పెన్షన్లు ఒకే రోజున అందించినట్లు పేర్కొన్నారు. మిగిలిన వారు బెడ్ పేషెంట్లుగా వివిధ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారని, కొందరు ఉద్యోగులు అక్కడికి వెళ్లి స్వయంగా వారికి అందించడం జరిగిందని తెలిపారు. దూర ప్రాంతాలకు వెళ్లి పంపిణీ చేసిన ఉద్యోగులను ఎంపీడీవో అభినందించారు.

రికార్డు స్థాయిలో పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : ఇంటి వద్దనే పెన్షన్ పంపిణీ చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం గత ఐదు సంవత్సరాలలో ఏనాడూ జరగని విధంగా మొట్ట సారిగా 95శాతం లబ్ధిదారులకు ఇంటి వద్దనే గ్రామ సచివాలయ సిబ్బందిచే పంపిణీ చేసి రికార్డు నెలకొల్పినట్లు టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగ జగదీశ్వరరావు అన్నారు. స్థానిక టిడిపి పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ ఉపాధ్యాయులు ఒకటో తేదీన జీతాల కోసం ఐదు సంవత్సరాలుగా ఎదురు చూసినప్పటికీ ఏనాడూ ఒకటో తేదీన జీతాలు, పెన్షన్ పడలేదని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం చంద్రబాబు జూలై 1, 2వ తేదీలలో జమ చేసి వారిని ఆనందపరిచారని హర్షం వ్యక్తం చేశారు. ఈ పెన్షన్ పంపిణీ సమర్ధవంతంగా పనిచేయగల వ్యవస్థ ప్రభుత్వంలో ఉన్నప్పటికీ వైసిపి ప్రభుత్వం ఆనాటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి పింఛనుదారుల జీవితాలతో చెలగాటమాడారని తెలిపారు. ఏప్రిల్ నెలలో అప్పటి ప్రభుత్వం ఉద్దేశం పూర్వకంగా రాజకీయంగా తెలుగుదేశం జనసేనపై బురదజల్లే ఉద్దేశంతోనే వాలంటీర్లు లేకపోతే పెన్షన్లు పంపిణీ సాధ్యం కాదని 32 మంది ప్రాణాలు పోవడానికి కారకులయ్యారని విమర్శించారు. సమావేశంలో రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి బుద్ద కాశి, నోబెల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల్లో పేర్లు మార్చరూ..

ప్రజాశక్తి -అనకాపల్లి

ప్రభుత్వం రేషన్ కార్డుల్లో పేర్లు మార్పులు చేర్పులను తక్షణమే చేపట్టేలా ఆదేశాలు విడుదల చేయాలని పలువురు విద్యార్థులు కోరుతున్నారు. ఎన్నికల ముందు వరకు రైస్ కార్డులో తమ కుటుంబ సభ్యుల పేర్లు మార్పులు చేర్పులకు వార్డు గ్రామ సచివాలయాల్లో చేపట్టేవారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఈ సేవలను రద్దు చేసింది. ప్రస్తుతం పాఠశాలలో కళాశాలలో విద్యార్థులు చేరుతున్నందున తెల్ల రేషన్ కార్డులో తమ పేరు లేని విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హులు కారు. దీనివలన ఎంతోమంది పేద విద్యార్థులు విద్యకు దూరం కావలసి ఉంటుంది. ప్రభుత్వం ఏపీ ఈఏపీసెట్ 2024 బీటెక్ అడ్మిషన్ల ప్రక్రియను ఈనెల ఒకటి నుంచి ప్రారంభించింది. ఇందులో భాగంగా విద్యార్థుల రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ల వెరిఫికేషన్, సీట్ల అలాట్మెంట్ జరుగుతుంది. అయితే నూతన ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో రేషన్ కార్డులో పేర్లు మార్పులు చేర్పులు ఆప్షన్ మీసేవ కేంద్రాల ద్వారా జరిపేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని పలువురు పేద విద్యార్థులు కోరుతున్నారు.



బీటెక్ కౌన్సెలింగ్ తేదీలను చూపుతున్న భువన లక్ష్మి

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-అచ్యుతాపురం

అచ్యుతాపురం జంక్షన్ విస్తరణ పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ సంబంధిత అధికారులతో రెండు రోజులు ముందుగా ఆర్ అండ్ బి సరిహద్దు స్థలాలను భవనాలను పర్యవేక్షించారు. అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యే సూచనల మేరకు విస్తరణకు అధికారులు చర్యలు చేపట్టారు. దశాబ్దాలు తరబడి విస్తరణ పనులకు నోచని ఈ జంక్షన్ విస్తరణ చేపడుతున్నారు. రహదారి విస్తరణకు సేకరించిన స్థలాలను స్వాధీనపరుచుకుంటున్నారు. ఆర్ అండ్ బి అధికారులు నిర్దేశించిన సరిహద్దుల్లో భవనాలను జెసిబి సహాయంతో కూలుస్తున్నారు. ముందుగా సంబంధిత గృహ, భవన యజమానులకు సమాచారం అందించారు. భవనాలలో ఉన్న వస్తు సామాగ్రిలను భద్రపరచుకోవాలని సూచించారు. ఖాళీ అయినా భవనాలను ఆర్ అండ్ బి అధికారులు పోలీసుల సమక్షంలో కూల్చివేత కార్యక్రమం ప్రారంభించారు. భవనాలు కూల్చడంతో జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్యకు మోక్షం ఏర్పడుతుందని అనేకమంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భారీ వాహనాలు రాకపోకలకు వీలుగా మారుతుందని తెలిపారు. ఎస్ఈజెడ్ పరిశ్రమలకు రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలకు ట్రాఫిక్ సమస్య కొంతమేరకు తగ్గుతుందని చెబుతున్నారు.



రోడ్డు విస్తరణకు భవనాలను తొలగిస్తున్న దృశ్యం

పారిశుద్ధ్య కార్మికునికి కుక్క కాటు

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం పంచాయతీ పరిధిలో పారిశుధ్య కార్మికునిగా పని చేస్తున్న అర్జునపై కుక్కదాడి చేసింది. బంగారయ్యపేట బిసి కాలనీలో అర్జున బుధవారం విధులు నిర్వహిస్తుండగా, కుక్క ఆయన ఎడమ కాలును కర్చింది. రక్తస్రావం కావడంతో అర్జున తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్స చేయించుకున్నారు. అర్జున మాకవరపాలెం మండలం తామరం గ్రామం నుండి రోజూ ఇక్కడకి వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. అర్జునపై కుక్క దాడి చేసిన నేపథ్యంలో తోటి పారిశుధ్య కార్మికులు భయాందోళన చెందుతున్నారు.

అస్తవ్యస్తంగా జల్‌జీవన్ మిషన్ పనులు



సమస్యలపై అధికారులను నిలదీస్తున్న సభ్యులు

మండల సభలో సభ్యుల ఆగ్రహం... అధికారులను నిలదీత

కోటవురట్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-కోటవురట్ల : అస్తవ్యస్తంగా సాగి, ఆగిన జల్‌జీవన్ మిషన్ పనులపై మండల సర్వసభ్యసమావేశంలో సభ్యులు సంబంధిత అధికారులను నిలదీశారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అప్పలనాయుడు అధ్యక్షతన ఎంపిడిఒ కాశీ విశ్వనాథరావు ఆధ్వర్యంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా ఎజెండా ప్రకారం శాఖలవారీ సమీక్షలో మండల వ్యాప్తంగా జరుగుతున్న జల్‌జీవన్ మిషన్ పనులు పట్ల పలువురు సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు, కొడవటిపూడి, అన్నవరం, కోటవురట్ల తదితర గ్రామాల ఎంపిటిసి సభ్యులు దీనిపై సభలో అధికారులను నిలదీశారు స్పష్టమైన సమాధానం చెప్పక పోవడం తో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు, పైపులైను ఇష్టను సారంగా చేయడం, గ్రామాల లో ట్యాంకులు నిర్మాణం చేపట్టక పోవడం సహా పైపులైన్లు పనులు జరిగే సమయంలో రోడ్లు అన్ని ఛిద్రమైనా పట్టించు కోలేదని పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు అధికారులను ప్రశ్నించి, ఆగ్రహం వ్యక్తం చేశారు.

నీలుగుంట సర్పంచ్ వరహాలబాబు మాట్లాడుతూతమ గ్రామంలో ట్యాంక్ నిర్మాణం చేపట్టి ఏడాది కావస్తున్నా, నేటికీ ట్యాంక్ నుంచి నీరు సరఫరా చేయడం లేదన్నారు. గ్రామసభ నిర్వహించకుండా, పనుల గుర్తింపుపై తీర్మానాలు, ప్రతిపాదనలు లేకుండా ఉపాధి హామీ పనులు చేపట్టడంపై ఎంపిటిసి సభ్యులు సూర్యారావు సభలో ప్రశ్నించారు

ఇటీవల ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ సమయంలో సచివాలయ సిబ్బంది, అధికారులు ప్రోటోకాల్ పాటించలేదని అధికారులను పాములవాక సర్పంచ్ సత్యవతి నిలదీశారు, మండలసభలో సభ్యులకు ఇచ్చే ఎజెండా ప్రతులు మొక్కుబడిగా తయారు చేయడం పట్ల ఎంపిడి కాశీ విశ్వనాథరావును కోటవురట్ల ఎంపిటిసి సభ్యులు సూర్యారావు ప్రశ్నించారు. ఇప్పటికైనా తీరు మార్చుకోవాలని సూచించారు. అభివృద్ధి పనులపై ఇంతవరకు సభ్యులతో సమావేశం ఏర్పాటు చేయకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు, మండల వ్యవసాయ అధికారిని సరోజిని రైతులకు అందజేస్తున్న సేవల పట్ల పలువురు సభ్యులు హర్షం వ్యక్తం చేశారు, కార్యక్రమంలో పలు శాఖల అధికారులు సంబంధిత శాఖల పురోగతిని, నివేదికలను సభలో వినిపించారు. తహశీల్దార్ వెంకటరమణ, జెడ్‌పిటిసి సభ్యురాలు ఉమాదేవి, దత్తుడు రాజు, పెట్ల రాంబాబు, లింగన్న నాయుడు, బుద్దేటి వెంకటరమణ, చీకట్ల జగదీష్, అనిల్ కుమార్, అయ్యప్ప రెడ్డి సుబ్బలక్ష్మి, లాలం పద్మావతి, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు

రాయితీపై వరి విత్తనాల పంపిణీ



కొత్త ఎల్లవరంలో విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రాంబాబు

ప్రజాశక్తి -గొలుగొండ: మండలంలో కొత్త ఎల్లవరం, పాత మల్లంపేట తదితర గ్రామాల్లో బుధవారం ఆర్‌బికెల ద్వారా రైతులకు వరివిత్తనాలను పంపిణీ చేశారు. కొత్త ఎల్లవరంలో సర్పంచ్ కొల్లు రాంబాబు పాత మల్లంపేటలో జనసేన మండల అధ్యక్షులు గండెం దొరబాబు, సర్పంచ్ గెడ్డం ఆదిలక్ష్మి ఆనంద్ ఆధ్వర్యంలో వేర్వేరుగా విత్తనాలు పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతులకు ప్రభుత్వం అందజేస్తున్న రాయితీ విత్తనాలు, ఇతర ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కసిమి టిడిపి నాయకులు బాబురావు, పాలమల్లంపేట టిడిపి నేత నీలాపు చంద్రరావు, నానాజీ, సచివాలయ హార్టికల్చరల్ అసిస్టెంట్ మైదాన్, పలువురు రైతులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- రూ. 20 లక్షల ఆస్తి నష్టం



దగ్ధమౌతున్న ఇల్లు

ప్రజాశక్తి-కోటవురట్ల: మండల కేంద్రంలో సచివాలయానికి వెళ్లి దారిలో జానకి హరిబాబు అనే వ్యక్తికి చెందిన ఇల్లు హై వోల్టేజీ రావడంతో షార్ట్ సర్క్యూట్ అయి దగ్ధమైంది. ఈప్రమాదంలో సుమారు రూ. 20 లక్షల ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అంచనా వేశారు, విలువైన ఫర్నిచర్ ఎసిలు, ఫ్రిజ్‌లు, ఇతర గృహోపకరణాలు అగ్నికి ఆహుతయ్యాయి.

బుధవారం మధ్యాహ్నం మూడున్నర ప్రాంతంలో సినిమా హాలు సెంటర్ వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్‌లో హైవోల్టేజీ కారణంగా గ్రామంలో మరికొన్ని చోట్ల పలువురి గృహపకరణాలు దెబ్బతిన్నాయి. ప్రమాద సమయంలో హరిబాబు ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది.. సమాచారం అందుకున్న స్థానిక తహశీల్దార్ వెంకటరమణ దగ్ధమైన ఇళ్లను పరిశీలించారు, స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందజేయడంతో మంటలను అదుపు చేశారు.

యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



మాట్లాడుతున్న జగన్నాథం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : యువత పారిశ్రామిక రంగంలో ఎదిగేందుకు అద్భుత అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకొని వ్యాపార, పారిశ్రామిక వేత్తలుగా రాణించాలని వెలగా జగన్నాథం పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యార్థులతో నిర్వహించిన స్వావలంభి భారత్ అభియాన్ కార్యక్రమంలో మాట్లాడుతూ, యువత పారిశ్రామిక వేత్తలుగా పురోగమించి, ప్రపంచంలో 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారతదేశం ఎదిగేందుకు తోడ్పడాలని కోరారు.

యువ పారిశ్రామికవేత్త ముత్యాల నాయుడు విద్యార్థులతో ముచ్చటిస్తూ తాను ఏ విధంగా మొబైల్ ఆక్సిసరీస్ సంస్థను స్థాపించి విజయవంతంగా రాణించారో వివరించారు. తాను ఉపాధి పొందడంతోపాటు మరో 20 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నానని వివరించారు. బ్యాంక్ రుణాల అనుసంధానకర్త పారుపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ హామీ లేని రుణాలు అందిస్తూ కేంద్ర ప్రభుత్వం వ్యాపారవేత్తలను ప్రోత్సహిస్తోందని, దేశాన్ని ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పాటును అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజు, కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్పీకర్‌ను కలిసిన గిరిజన సంక్షేమాధికారి



స్పీకర్ అయ్యన్నను అభినందిస్తున్న గిరిజన సంక్షేమ అధికారులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడును గిరిజన సంక్షేమశాఖ జిల్లా అధికారి వి.నాగ శిరీష బుధవారం అయ్యన్న స్వగహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంక్షేమ హాస్టళ్లల్లో నెలకొన్న సమస్యలను అయ్యన్న దృష్టికి తీసుకువెళ్లారు.దీనిపై అయ్యన్న స్పందిస్తూ, హాస్టళ్లలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కషి చేస్తానని చెప్పారు.హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ టి.మల్లేష్ ఎన్.ఈశ్వరరావు, వరలక్ష్మి, ప్రణవి, శిరీష భాయి పాల్గొన్నారు.

జనసేనలోకి చేరిక

ప్రజాశక్తి- చీడికాడ : మాడుగుల నియోజకవర్గం చీడికాడ మండల లింగ భూపాలపట్నం గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు సిడిసి మాజీ వైస్ చైర్మన్ పోతల శ్రీరాంమూర్తి బుధవారం మాడుగుల నియోజకవర్గ జనసేన సమన్వయకర్త రాయపురెడ్డి కృష్ణ ఆధ్వర్యంలో, జనసేన ఉమ్మడి విశాఖ జిల్లా రూరల్ అధ్యక్షులు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. పోతల శ్రీరామ్‌మూర్తికి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు జనసేన పార్టీ కండువా వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు యాళ్ల ప్రసాద్, కశింకోట సంతోష్ పాల్గొన్నారు

క్రమశిక్షణతో విద్యాబోధన చేయాలి

ప్రజాశక్తి- చీడికాడ : విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని మండల విద్యాశాఖ అధికారి బొంజుబాబు ఉపాధ్యాయులను ఆదేశించారు. బుధవారం చీడికాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ సమయపాలన పాటించాలని, నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని, ప్రతిరోజు విద్యార్థులకు ఐఎఫ్ఎ మాత్రలు వేయించాలని సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యతతో, రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. వంట తయారీ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులకు ఆదేశించారు. విద్యా సంవత్సరానికి సంబంధించి తగు జాగ్రత్తలు, విద్యా బోధనపై తీసుకోవలసిన అంశాలు, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఉపాధ్యాయులు బాధ్యతగా మెలగాలని ఆదేశించారు. విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేలా యోగ చేయించాలని వ్యాయామ ఉపాధ్యాయులను ఆదేశించారు.

ఉపాధి వేతన బకాయి చెల్లించాలని ధర్నా



వమ్మవరంలో ధర్నా చేస్తున్న ఉపాధి కూలీలు

ప్రజాశక్తి- ఎస్.రాయవరం : మండలంలో వమ్మవరం గ్రామంలో ఉపాధి బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ స్థానిక సచివాలయం వద్ద బుధవారం కూలీలు ధర్నా నిర్వహించారు. గ్రామ కార్యదర్శికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి కూలీకు తొమ్మిది వారాలకు సంబంధించి కూలీ బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ఉపాధి చట్టంలోని నిబంధనల ప్రకారం పేస్లిప్పులు అందజేసి, రెండు వారాల్లోనే కూలీ డబ్బులు క్లియర్ చేయాల్సి ఉన్నా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. వారాల తరబడి చేసిన పనులకు ఉపాధి బిల్లులు చెల్లించకపోవడం వల్ల జీవనానికి పేద ఉపాధి కూలీలు ఇబ్బందులు పడుతున్నా రన్నారు.


తక్షణమే వేతన బకాయిలు చెల్లించాలని, లేకుంటే ఎంపిడిఒ, ఎపిఒ కార్యాలయాల వద్దకు వెళ్లి ఆందోళన చేయక తప్పదని హెచ్చరించారు. ఉపాధి హామీ చట్టంలోన నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉపాధి పనిప్రదేశంలో సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొండమ్మ అప్పల రవణమ్మ జ్యోతి దేవి సాయి తదితరులు పాల్గొన్నారు.

పంటల వివరాలు సేకరించాలి

ప్రజాశక్తి- కోటవురట్ల : ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 2021-22 సంవత్సరానికి సంబంధించి అగ్రికల్చర్ సెన్సెస్, పంటలకు సంబంధించి సమగ్ర వివరాలు సేకరించాలని ఇన్‌చార్జి ఎఎస్ఒ రామకృష్ణ కోరారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ వెంకటరమణ ఆధ్వర్యంలో గ్రామ రెవిన్యూ అధికారులు రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా అగ్రికల్చర్ ల్యాండ్ వివరాలు ఆ యాడాది రైతులు పండించిన వివిధ పంటల వివరాలు అదేవిధంగా 2021-22 సంవత్సరానికి సంబంధించి సాగుబడిలో ఉన్న భూములు, వాటిల్లో ఏయే పంటలు సాగుచేసింది, వచ్చిన పంట దిగుబడులు ఇతరత్రా పూర్తి సమాచారాన్ని సేకరించానలి సూచించారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ ఊర్ధవరావు, డిఒఎస్ఒ భానోజీరావు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అల్లూరి పోరాటాలకు ఇదేనా గుర్తింపు!

నేడు అల్లూరి చిత్రకళా మందిరం ప్రారంభం


అల్లూరిచిత్రకళా మందిరంలో మాట్లాడుతున్న పడాల బృందం

ప్రజాశక్తి-గొలుగొండ: జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం ఆధ్వర్యంలో కృష్ణదేవిపేటలోని అల్లూరి స్మారక పార్కులో శాశ్వతంగా ఏర్పాటు చేసిన అల్లూరి చిత్రకళా మందిరాన్ని గురువారం ఉదయం 9:30 గంటలకు రాష్ట్ర శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆవిష్కరిస్తారని, దీనికి సర్వం సిద్ధం చేసినట్లు సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు తెలిపారు. అనకాపల్లి ఎంపీ సిఎం.రమేష్, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే, పల్లా శ్రీనివాసరావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు పాల్గొంటారన్నారు. అల్లూరి చిత్రకళా మందిరంలో అల్లూరి చరిత్రకు సంబంధించి 18 మంది ప్రముఖ చిత్రకారులు చిత్రీకరించిన కళాఖండాలను పార్కుకు వస్తున్న సందర్శకుల పరిశీలనకు, విద్యార్థుల పరిశోధనకు దోహదపడేలా ఏర్పాటు చేశామని పడాల వీరభద్రరావు తెలిపారు. కార్యక్రమంలో జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం కార్యదర్శులు శ్యామల వరలక్ష్మి, పల్లా భాస్కరమణి, అంబటి వరహాల రాజు, లక్కాకుల బాబ్జి, మాదేటి రాజాజీ మెమోరియల్ ఆర్ట్ అకాడమీ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి మాదేటి రవి ప్రకాష్, అల్లూరి మనవడు అల్లూరి శ్రీరామరాజు పాల్గొన్నారు.

నేడు అల్లూరి విగ్రహ ప్రతిష్ట

గొలుగొండ: మండలంలో ఎఎల్ పురం అల్లూరి మైత్రి గ్రంథాలయ ఆవరణలో గ్రంథాలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం అల్లూరి విగ్రహ ప్రతిష్ట జరుగుతంది. జిల్లా ఎస్‌పి కెవి.మురళీకృష్ణ, గ్రంథాలయ వ్యవస్థాపకులు వి.వీరభద్రశర్మ హాజరవుతున్నారని నిర్వాహకులు తెలిపారు. అకార్యక్రమంలో గ్రంథాలయనిర్వహణకు సేవలందిస్తున్న పలువురు ప్రముఖులు పాల్గొంటారని, ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

10న కోర్కెల దినాన్ని జయప్రదం చేయండి

- సిఐటియు జిల్లా కోశాధికారి శ్రీనివాసరావు


స్కీం వర్కర్స్‌తో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి -నక్కపల్లి : కేంద్రం, రాష్ట్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వాలు ఉద్యోగ, కార్మికుల సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ నెల10న సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టనున్న కోర్కెల దినాన్ని జయప్రదం చేయాలని ఆ యూనియన్ జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు బుధవారం నక్కపల్లి నూకాలమ్మ తల్లి గుడి ఆవరణలో ఎం. దుర్గారాణి అధ్యక్షతన జరిగిన సిఐటియు నక్కపల్లి మండల సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ, ఏళ్ల తరబడి చిరు ఉద్యోగులు, స్కీమ్ కార్మికులైన అంగన్వాడీ, ఆశా, విఒఎలు, మిడ్డేమీల్స్ వర్కర్స్, పంచాయతీ తదితర కార్మికుల సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయన్నారు. వీటి పరిష్కారానికి నూతన ప్రభుత్వాలపై ఆయారంగాల కార్మికులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారన్నారన్నారు. ఇప్పటికైనా కార్మిక అనుకూల విధానాలు అమలు చేయాలని కోరారు. గత హామీల అమలుకు ఐక్యంగా కదలాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎం రాజేష్, రమణమ్మ, నారాయణరావు, సత్యనారాయణ, వరలక్ష్మీ, కృష్ణవేణి, లక్ష్మి పాల్గొన్నారు.

- చారిత్రక చిహ్నాల పరిరక్షణలో పాలకులు విఫలం
- మాటలకే పరిమితమైన నేతల అభివృద్ధి హామీలు
- ప్రతిపాదనలతోనే పర్యాటకశాఖ కాలయాపన

నేడు అల్లూరి 127వ జయంతి

ప్రజాశక్తి -గొలుగొండ : బ్రిటీషు దొరల పరిపాలనా విధానాలను వ్యతిరేకించి, మన్యంలో విప్లవాన్ని నడిపించిన మన్యం వీరుడు అల్లూరి చరిత్రకు నేటికీ పూర్తిస్థాయి గుర్తింపు లేదు. మన్యం వీరుడు నడయాడిన ప్రదేశాలు, అమరుడైన ప్రాంతం, ఇతర చరిత్రకు సాక్షాలుగా నిలిచే వాటిని పరిరక్షించడం, వాటిని అభివృద్ధి చేయడంలో పాలకులు, ప్రభుత్వాలు నిర్లక్ష్యం చూపుతున్నారనే విమర్శలున్నాయి.

అల్లూరి అసలు పేరు శ్రీరామరాజు అయితే పోలీసుల ఫార్యాదులలో ఆంగ్లేయుల చేతిరాత కారణంగా శ్రీరామరాజు బదులుగా సీతారామరాజుగా మార్పు చెందింది. విశాఖ జిల్లా పద్మనాభ మండలంలో 1897 జూలై 4న జన్మించిన అల్లూరి, తూర్పుగోదావరి జిల్లాలో విద్యాభ్యాసం తర్వాత విశాఖజిల్లా కేడిపేట ప్రాంతానికి వచ్చారు. బానిసత్వంలో మగ్గుతున్న గిరిజనుల ఇబ్బందులు, ఆంగ్లేయుల అకృత్యాలను సహించలేక మన్యం విప్లవాన్ని ప్రారంభించాడు. 1922లో ప్రారంభమైన అల్లూరి విప్లవం 1924 మే 7న ఆయనను బంధించి, వధించడంతో ముగిసింది. అల్లూరి సాగించిన మన్యం విప్లవం కేవలం రెండేళ్లే అయినప్పటికీ, తెల్లదొరల గుండెలో రైళ్లు పరుగెత్తించాడు.బ్రిటీషర్లపై పోరాటంలో భాగంగా 1922 ఆగష్టు 22న చింతపల్లి, 23న కృష్ణదేవిపేట 26న రాజవొమ్మంగి, 27న అన్నవరం, అడ్డతీగల, రంపచోడవరం పోలీసు స్టేషన్లపై దాడి, ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాడు. దీంతో బెంబేలెత్తిన తెల్లదొరలు అల్లూరిని పట్టుకోవడానికి ఎన్నో పథకాలు వేస, చివరకు 1924 మే 7న మంప సమీపంలో స్నానం చేస్తుండగా దొంగచాటుగా పట్టుకున్నారు. రాజేంద్రపాలెం తీసుకువచ్చి మేజర్ గుడాల్ తుపాకీతో కాల్చి చంపాడు. అనంతరం కేడిపేట మృతదేహాన్ని తీసుకువచ్చి సమాధి చేశారు. మన్యం వీరుడు అల్లూరి సాగించిన విప్లవానికి, స్వాతంత్ర్యోద్యమానికి సజీవ సాక్ష్యాలుగాఉన్న ప్రాంతాల అభివృద్ధిలో అధికారులు, నేతల మాటలు కోటలు దాటాయే తప్ప, ఆచరణలో అమలుకు నోచుకోలేదనే ఆరోపణలున్నాయి.

ప్రతిపాదనలే తప్ప ఆశించిన స్థాయిలో జరగని అభివృద్ధి

2003లో అప్పటి టిడిపి ప్రభుత్వం పర్యాటకశాఖ అల్లూరి నడయాడిన ప్రాంతాలను భావితరాలకు, ఇదేశం మొత్తానికి తెలిసేలా అభివృద్ధి చేస్తామని రు.3.60 కోట్లతో ప్రతిపాదనలు చేసి, నిధులు మంజూరుచేస్తున్నట్లు వెల్లడించింది. ఆ నిధులతో అల్లూరి సమాదులున్న పార్కులో పర్యాటకులు విశ్రాంతి కోసం కాటేజీల ఏర్పాటు, సమాధులు ఆధునికీకరణ, సమాధుల వద్ద నిత్యం వెలిగేలా అఖండ జ్యోతి ఏర్పాటు, పార్కులో అల్లూరి భారీవిగ్రహం, అల్లూరి చరిత్ర తెలిసేలా చిత్రపటాలతో మ్యూజియం ఏర్పాటు, గ్రంథాలయం, అల్లూరి స్నానం చేసి పూజలు నిర్వహించే గాదిగుమ్మి జలపాతం కాటేజీలు ఏర్పాటు వంటివి చేపట్టాల్సి ఉంది. ఇందులో భాగంగా విడుదలైన నిధులు రూ.23 లక్షలతో అల్లూరి, పార్కును ఆధునికీకరించి, చుట్టూ ఆకర్షించే పూలమొక్కలు, పలు రకాల చెట్లను పెంచి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించారు. పార్కులో టైల్స్‌ను అమర్చారు. అప్పట్లో ప్రభుత్వం మారిపోవడంతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. కాంగ్రెసు ప్రభుత్వహయాంలో


అల్లూరి, గంటందొర సమాధులు

పర్యాటకశాఖ ముందుకొచ్చినా పనులు జరగలేదు. 2013లో అప్పటి గిరిజన శాఖా మంత్రి బాలరాజు భద్రాచలం నుండి మంప, కేడిపేట, అరుకు వరకు పర్యాటక కారిడారుగా అభివృద్ధి చేస్తామన్న ప్రకటన కూడా నేటికీ కార్య రూపం దాల్చలేదు. 2014లో టిడిపి మళ్లీ అధికారంలోకి వచ్చిన తరువాత రూ. 90 లక్షలతో పార్కులో పర్యాటకులు సేద తీరేందుకు గడ్డితో కట్టిన ఆకర్షణీయమైన పాకలు ఏర్పాటు, విశ్రాంతి తీసుకునే సిమెంటు బల్లలు. మినీ థియేటర్ ఏర్పాటు, గాదిగుమ్మి జలపాతం వద్ద పర్యాటకులు సేదతీరేందుకు షెడ్ల ఏర్పాటు చేశారు. సమాధుల వద్ద అఖండజ్యోతి, కాటేజీలు, అల్లూరి విగ్రహం. మరుగుదొడ్లు వంటి అభివృద్ధి పనులు జరగలేదు.ప్రస్తుత ప్రభుత్వం అల్లూరి పార్కులో ఆరేళ్లుగా సంరక్షకులుగా ముగ్గురు కాంట్రాక్టు ఉద్యోగులను పర్యాటకశాఖ గుర్తించి వారికి వేతనాలును మంజూరు చేశారు.

శిథిల ప్రగోడాలను పట్టించుకునే వారు లేరు..

అల్లూరి స్మృతికి చిహ్నాలుగా ఉన్న గడ్డితో ఏర్పాటుచేసిన ఆకర్షణమైన పాకలు (ప్రగోడాలు) శిథిలావస్థకు చేరుకున్న పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. అలాగే సమాధులు ఉన్న పైకప్పు ప్రాంతమంతా పెచ్చులూడి పడిపోతోంది. పార్కులో రెండేళ్లుగా తాగునీటి సమస్య ఉంది. దీనిపై అధికారులు, నేతలకు పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకునే దిక్కులేదు. 2019లో అప్పటి పర్యాటకమంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు పార్క్ అభివృద్ధికి రూ.50 లక్షలు మంజూరు చేస్తానని



హామీ ఇచ్చి, అటునుంచి అటే వెళ్లిపోయారు. అల్లూరి జాతీయ యువజన సేవా సంఘం గౌరవాధ్యక్షులు పడాల వీరభద్రరావు ఆధ్వర్యంలో పలుమార్లు దీనిపై విన్నవించగా, రూ.1.16కోట్లతో అభివృద్ధి చేస్తామని పర్యాటక శాఖ ప్రకటించింది. అయితే నేటికీ రెండేళ్లు గడిచినా అది ఆచరణలో కార్యరూపం దాల్చలేదు.

అల్లూరి పార్కులో చేయాల్సిన పనులు

అల్లూరి పార్కులో సభలు, సమావేశాలు నిర్వహణకు సభావేదిక ఏర్పాటు, పార్కులో సోలార్ విద్యుత్ దీపాలు, గ్రంథాలయం, క్యాంటీన్ ఏర్పాటు, అరకు నుండి కేడీపేట మీదుగా పర్యాటకులకు బస్సు సౌకర్యం కల్పించాల్సి ఉంది.


అల్లూరి పార్కులో శిథిలావస్థలోఉన్న పగోడాలు

అల్లూరి పార్కులో పరిశుభ్రతా పనులు


పార్కులో పరిశుభ్రతా పనులు చేయిస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి- గొలుగొండ: మండలంలో ఏజెన్సీ లక్ష్మీపురం మేజర్ పంచాయతీలోని చారిత్రక అల్లూరి సీతారామరాజు పార్క్‌లో ఈనెల 4న అల్లూరి జయంతిని పురస్కరించుకుని కార్యక్రమాల నిర్వహణకు వీలుగా పార్కును శుభ్రం చేయడం, ఇతర పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామ సర్పంచ్ లోచల సుజాత, పంచాయతీ కార్యదర్శి వై.శ్రీనివాస రావు ఆధ్వర్యంలో పార్క్ పరిసరాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. సమావేశ మందిరంలో విద్యుత్ బల్బులు బాగుచేయించా సచివాలయ కార్యదర్శి కె.రాజేష్, మండల స్వచ్ఛసంకల్ప కోఆర్డినేటర్ పి. మాధవ్, పార్క్ సంరక్షకులు,పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.